

లక్ష్యాల సాధనకు సమన్వయంతో పనిచేయాలి

- భూ సమస్యల పరిష్కారానికి చర్యలు
- రెసిడెన్షియల్ పాఠశాలల్లో నాణ్యమైన భోజనం అందాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్లకు మంత్రుల ఆదేశాలు

6



ఎర్త్‌సైన్స్‌కు నిధులెలా?

- డాక్టర్ మన్మోహన్‌సింగ్ యూనివర్సిటీకి రూ.500కోట్లతో ప్రతిపాదనలు
- సింగరేణి సీఎస్ఆర్ నిధుల కేటాయింపులపై భిన్నాభిప్రాయాలు
- ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి ఇవ్వాలంటూ డిమాండ్లు
- చాకలి ఐలమ్మ వర్సిటీకి రూ.84.20కోట్లు ఇస్తోందన్న నేపథ్యంలో తెరపైకి..



గతంలో కొత్తగూడెంలో ఉన్న మైనింగ్ కళాశాలను ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీగా మార్చిన రాష్ట్ర ప్రభుత్వం ఆ వర్సిటీకి డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఎర్త్‌సైన్స్ యూనివర్శిటీగా నామకరణం చేసింది. ఎంతో ప్రతిష్ఠాత్మకమైన ఈ యూనివర్సిటీలో ఈ ఏడాది నుంచే కొత్తగా ఏర్పాటు చేసే కోర్సులను కూడా ప్రారంభించాలని ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఈ క్రమంలోనే యూనివర్సిటీకి ఇన్‌చార్జ్ వైస్ చాన్స్‌లర్, రాష్ట్ర ఉన్నత విద్యామండలి ప్రిన్సిపల్ సెక్రటరీ అయిన యోగితారాణాను యూనివర్సిటీని పరిశీలించి.. అధికారులతో సమీక్షించాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఆమె బుధవారం కొత్తగూడెం వస్తున్నారు.

కొత్తగూడెం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీకి ప్రస్తుతం నిర్మాణాలకు, వివిధ రకాల కోర్సుల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.500 కోట్లు అవసరం ఉంటుందని ప్రతిపాదించింది. ఆ నిధులు మంజూరు చేస్తేనే ఈ ఏడాది కోర్సుల ప్రారంభానికి అవకాశం ఉంటుంది. ఇక 2025 - 26 విద్యా సంవత్సరంలో కొత్త ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ పేరిట ఇంజనీరింగ్ విద్యార్థులకు పాత కోర్సులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. కొత్త యూనివర్శిటీకి అకడమిక్, ప్రయోగశాలలు, హాస్టల్స్, నూతన ప్రయోగశాలలు, స్పోర్ట్స్ కాంప్లెక్స్ కోసం దాదాపు రూ.500 కోట్లు అవసరం అవుతుంది. గతంలో కొత్తగూడెం మైనింగ్ కాలేజీకి సింగరేణి ప్రభావిత ప్రాంతంలో ఉండటం వల్ల సింగరేణి సంస్థ ఆ కళాశాలకు సింగరేణి ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్) నిధులను కేటాయించే పరిస్థితి ఉంది. అయితే హైదరాబాద్ కోఠిలో నిర్మాణం జరుగుతున్న చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీకి సింగరేణి సంస్థ సీఎస్ఆర్ పాలసీలో భాగంగా సంస్థ రూ.84.20కోట్లు కేటాయించినట్లు తెలిసిన నేపథ్యంలో కొత్తగూడెంలోని మన్మోహన్ సింగ్ ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ మాటేంటి అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. సింగరేణి ప్రభావిత (మిగతా 6వ పేజీలో)

పనులు, నిధులు.. పెండింగ్

- ఫలితమివ్వని 'మన ఊరు- మనబడి'
- రెండేళ్లుగా నిధుల కోసం నిరీక్షణ
- భద్రాద్రి జిల్లాలో రూ. 11.60 కోట్లు పెండింగ్
- పట్టించుకోని అధికార యంత్రాంగం

7

ఉపాధ్యాయులు ఎక్కువ.. ప్రమాణాలు తక్కువ



- మిగులు ఉపాధ్యాయులు 497 మంది
- విద్యార్థుల 'భవిత'కు భరోసా ఏదీ?

7

పాడి పంటలకు సమ ప్రాధాన్యం

- అధికారి పనితీరు ఆధారంగానే డెయిరీల అభివృద్ధి
- పాడి పరిశ్రమ అభివృద్ధి అంటే.. పేదలు అభివృద్ధి చెందినట్టే
- శాశ్వత భవనంతోపాటు అన్ని మౌలిక సౌకర్యాలు
- 25వేల లీటర్ల పాల నిల్వలకు కావాల్సిన యూనిట్ల నిర్మాణం
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- విజయ డెయిరీ ఖమ్మం కేంద్రం తనిఖీ
- అభివృద్ధిపై అధికారులతో సమీక్ష



విజయ డెయిరీలో పాల నిల్వల యూనిట్‌ను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల



ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రజల అభ్యున్నతిలో పాడి, పంటలు ఎంతో కీలకమని, అలాంటి పాడి, పంటల అభివృద్ధికి ప్రభుత్వం సమ ప్రాధాన్యమిస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం ఖమ్మం నగరంలోని విజయ డెయిరీ పాల ఉత్పత్తుల కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. డెయిరీ నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్న ఆయన పలు పాల ఉత్పత్తులను ప్రారంభించి వాటి రుచి చూశారు. డెయిరీ ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ గతంలో రాష్ట్రం నుంచి ఇతర రాష్ట్రాలకు పాలు, పాల ఉత్పత్తులు సరఫరా జరిగితే ఇప్పుడు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోందని, అవి కూడా స్వచ్ఛంగా ఉండటం లేదన్నారు. చివరకు అశ్వారావుపేట లాంటి ప్రాంతాల్లో యూరియాతో కల్తీ పాల తయారీ జరుగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, ప్రజలు ప్రాణాలు కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఖమ్మంలోని విజయ డెయిరీ కేంద్రాన్ని రాష్ట్రంలోనే మోడల్ తీర్చిద్దాలంటే అధికారులే కీలకమన్నారు. ఎకరం భూమి లేని కుటుంబాలు కూడా పాడి గేదెలను ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందుతున్నాయని, అలాంటి వారిని ప్రోత్సహించడం, డిమాండ్ మేరకు పాల అమ్మకాలు, సేకరణ జరపడం ద్వారా విజయ డెయిరీ మంచిగా అభివృద్ధి జరుగుతుందన్నా రు. ఖమ్మం జిల్లాలో గేదె పాలు అధికంగా ఉత్పత్తవుతుండటంతో.. సమీప రాష్ట్రాల పాల వ్యాపారులు ఖమ్మం నుంచి పాల సేకరణ జరుపుతున్నారని, ఆ మేరకు విజయ డెయిరీ ఎందుకు సేకరణ జరపటం లేదని ప్రశ్నించారు. మంచి అధికారులను ఖమ్మం డెయిరీకి నియమించాల్సిన అవసరం ఉందన్నారు. కరీంనగర్‌లో డెయిరీ నిర్వహణ బాగుందని, అంతకు మించిన స్థాయిలో ఇక్కడి డెయిరీ ఉండాలని, 25వేల లీటర్ల పాల సేకరణ లక్ష్యంగా కార్యాచరణ చేయాలన్నారు. అందుకు కావాల్సిన భవనాలు, నీరు, విద్యుత్, ఆధునిక యంత్రాలు లాంటి సౌకర్యాలను తాను సమకూరుస్తానని హామీ ఇచ్చారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఆరు పాల సేకరణ కేంద్రాలను, పాల అమ్మకాల కేంద్రాల సంఖ్యను పెంచాలని ఆదేశించారు. డెయిరీ చుట్టూ డ్రెయినేజీలను ఏర్పాటు చేయాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యను ఆదేశించారు. డెయిరీ అభివృద్ధికి తీసుకోవాల్సిన అంశాలను వెంటనే పరిశీలించాలని కలెక్టర్ అనుదీప్‌ను ఆదేశించారు. డెయిరీ ఎదురుగా ఉన్న కాంప్లెక్స్ ప్రారంభం కాకుండానే బీటలు వారడంపై ఆరా తీశారు. కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్, నగర మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్లు చావా మాధురి, సైదులునాయక్, మాజీ కార్పొరేటర్ చావా నారాయణరావు, రఘునాథపాలెం సొసైటీ చైర్మన్ తాతా రఘురాం, దొబ్బల సౌజన్య పాల్గొన్నారు. అనంతరం 15వ డివిజన్‌లో పలు అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభించారు. ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు, రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. స్థానిక కార్పొరేటర్ రావూరి కరుణ, వీవీపాలెం సొసైటీ చైర్మన్ రావూరి సైదుబాబు పాల్గొన్నారు. రహదారుల నిర్మాణంలో నిబంధనలు పాటించటం లేదని, పలువురు కాంగ్రెస్ నాయకులు మంత్రి తుమ్మలకు ఫిర్యాదు చేశారు.

జల్సాలకు అలవాటై.. చెడు వ్యసనాలకు బానిసై..

- ఏడున్నర కిలోల గంజాయితో పట్టుబడిన మైనర్
- ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా స్వస్థలం
- వివరాలు వెల్లడించిన కల్లూరు ఏసీపీ రఘు

6



రామాలయంలో శ్రావణ మాసోత్సవాలివే..

- 4వ తేదీ నుంచి 9వరకు పవిత్రోత్సవాలు
- ఆ రోజుల్లో పవళింపు సేవ నిలిపివేత
- 22న లక్ష్మీతాయారు అమ్మవారికి పుష్పాంజలి

6

ఆస్పత్రుల నిర్వహణలో నిబంధనలు మీరొద్దు

- అనవసర ఆపరేషన్లు, లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు
- క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్‌ను పక్కాగా అమలు చేయాలి
- ప్రైవేట్ ఆస్పత్రుల్లో 'కక్కుర్తి కోత'లపై అదనపు కలెక్టర్ శ్రీజ సమీక్ష


కక్కుర్తి 'కోత'!

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఖమ్మం కలెక్టరేట్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వహణలో ప్రభుత్వ నిబంధనలు మీరితే కఠిన చర్యలు తప్పవని, నియమాల ప్రకారమే ఆస్పత్రులను నిర్వహించాలని, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు ప్రకారం నిర్వహణ లేకపోతే అనుమతులను రద్దుచేస్తామని అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ అన్నారు. 'కక్కుర్తి కోత!'లు శీర్షికన జిల్లాలోని ఆస్పత్రుల్లో చేస్తున్న సిజేరియన్లపై మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. మంగళవారం ప్రగతి మీటింగ్ హాల్‌లో ఆమె జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల యాజమానులు, చైర్మన్లు, మేనేజింగ్ డైరెక్టర్లతో.. పీసీపీఎన్‌డీటీ యాక్ట్, ఎంటీపీ యాక్ట్, బర్త్, డెత్ రిజిస్ట్రేషన్ యాక్ట్, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, ఆస్పత్రుల నిర్వహణ, వైద్యసేవలు, రోగుల భద్రత, రక్షణ, నిర్వహణ, రిజిస్ట్రేషన్ తదితర అంశాలపై సమీక్షించారు. జిల్లాలో వైద్య ఆరోగ్య సేవలను మెరుగుపరచడానికి క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ (రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్) చట్టం, గర్భస్థ పూర్వ, గర్భస్థ పిండ, లింగ నిర్ధారణ చట్టానికి కలెక్టర్ చైర్మన్‌గా ఉన్నారన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి స్కానింగ్ సెంటర్‌లో అమలవుతున్న నిబంధనలు పరిశీలించాలన్నారు. గర్భస్థ పూర్వ, గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం-1994, రూల్స్-1996 అమలు గురించి ప్రైవేట్ ఆస్పత్రుల యజమానులకు అవగాహన కల్పించాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన వారికి, చేయించిన వారికి శిక్ష కచ్చితంగా ఉంటుందని హెచ్చరించారు. స్కానింగ్ సెంటర్లలో కచ్చితంగా రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ధరల పట్టిక, సరైన రికార్డుల నిర్వహణ ఉండాలని, ప్రతినెల జరిగే స్కానింగ్ వివరాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి పంపించాలని, ఆన్‌లైన్ పోర్టల్‌లో కూడా నమోదు చేయాలన్నారు. ఆస్పత్రుల్లో నాణ్యమైన మెరుగైన వైద్య సేవలు అందించాలని, రోగుల భద్రతా ప్రమాణాలను పాటించాలని, వాటిని అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలన్నారు. జిల్లాలో 519 హాస్పటల్స్ రిజిస్ట్రేషన్ అయ్యాయని, సాధారణ ప్రసవలు జరిగేలా జాగ్రత్తలు, చర్యలు తీసుకోవాలని, వారానికి ఒకసారి ప్రజలకు ఉచిత వైద్య సేవలను అందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.కళావతిబాయి, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ వెంకటరమణ, డాక్టర్. చందు నాయక్, డాక్టర్ రామారావు, డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ బిందుశ్రీ, డెమో సుబ్రహ్మణ్యం, ఐఎంఏ డాక్టర్లు, ప్రైవేట్ ఆస్పత్రుల యాజమానులు, చైర్మన్లు, మేనేజింగ్ డైరెక్టర్లు పాల్గొన్నారు.



తల్లాడ మండలంలో అలుగు పారుతున్న సుభద్రమ్మ చెరువు

ఉమ్మడి జిల్లాలో జోరువాన

రాష్ట్రంలోనే టేకులపల్లిలో అత్యధికంగా 6.9 సెం.మీ వర్షపాతం

ఖమ్మం / కొత్తగూడెం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మంగళవారం కూడా జోరువాన కురిసింది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని పలు మండలాల్లో మంగళవారం మధ్యాహ్నం నుంచి మోస్తరు వర్షం పడగా.. సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం ఉదయం వరకు రాష్ట్రంలోనే అత్యధికంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లిలో 6.9సెంమీ వర్షపాతం నమోదైంది. ఖమ్మం జిల్లా కూసుమంచిలో 5, ఎర్రుపాలెంలో 4.8, ముదిగొండలో 4, మధిరలో 3.28, నేలకొండపల్లిలో 2.65, ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెంలో 2.53, ఖమ్మం అర్బన్ ప్రకాష్‌నగర్ ప్రాంతంలో 2.38, తిరుమలాయపాలెం బచ్చోడులో 2.25, మధిరలో 2, సత్తుపల్లిలో 1.53, ముదిగొండలో 1.4, కొణిజర్లలో 1.1 సెంమీ వర్షపాతం నమోదైంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో 3.43, దమ్మపేట అంకంపాలెంలో 2.83, సుజాతనగర్‌లో 2.65, ఆళ్లపల్లిలో 2.5, టేకులపల్లి మండలం కోయగూడెంలో 2.48, లక్ష్మీదేవిపల్లి, మణుగూరు, ముల్కలపల్లిలో 2.1, బూర్గంపాడులో 1.78, ఇల్లెందులో 1.73, గుండాల, చుంచుపల్లి మండలం గరిమెళ్లపాడులో 1.5, భద్రాచలంలో 1.4, కొత్తగూడెంలో 1.1 సెంమీ వర్షపాతం నమోదైంది. వర్షం కారణంగా సింగరేణి పరిధిలోని ఇల్లెందు, మణుగూరు, సత్తుపల్లి పరిధిలోని ఓపెన్‌కాస్టుల్లో వరదనీరు రావడం వల్ల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడుతోంది. పాల్వంచ మండలంలోని కిన్నెరసాని జలాశయం నిండుతోంది. 407 అడుగుల సామర్థ్యం కలిగిన కిన్నెరసాని రిజర్వాయర్ మంగళవారం సాయంత్రం 399.82 అడుగుల చేరింది. ఇన్‌ఫ్లో 4వేల క్యూసెక్కుల నీరు వస్తున్నట్లు జెన్కో అధికారులు వెల్లడించారు. 402 అడుగులకు నీరు చేరితే గేట్లు ఎత్తుతామని అధికారులు ప్రకటించారు.

అభివృద్ధికి నిధుల ఆమోదమే లక్ష్యంగా..

- నేడు ఖమ్మం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశం
- రూ.224 కోట్ల చెల్లింపులకు ప్రతిపాదనలు



ఖమ్మం కార్పొరేషన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పరిపాలనాపరమైన ఆర్థిక నిర్ణయాలతోపాటు ఉద్యోగులు, సిబ్బంది వేతనాల చెల్లింపులు, ఖమ్మం నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులకు పాలకవర్గ పరిపాలనపరమైన ఆమోదమే లక్ష్యంగా ఖమ్మం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశాన్ని బుధవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు మేయర్ పునుకొల్లు నీరజ సూచనల మేరకు కమిషనర్ అభిషేక్ అగస్త్య కౌన్సిల్ సమావేశానికి కావాల్సిన ఏర్పాట్లు చేశారు. మొత్తం 16 అంశాలకు సంబంధించిన విషయాలను కౌన్సిల్‌లో ఆమోదానికి పెట్టనున్నారు. వీటిలో ప్రధానంగా ఖమ్మం నగరంలో ఔట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న 984మంది కార్మికులు, 20మంది డీఆర్ఎఫ్ సిబ్బంది, ఇతర ఔట్‌సోర్సింగ్ అధికారుల వేతనాల మంజూరుకు ఆమోదించనున్నారు. అలాగే గత కౌన్సిల్ సమావేశం తర్వాత నగరంలో చేపట్టిన రూ.224 కోట్ల అభివృద్ధి పనులకు బిల్లుల చెల్లింపులకు, 4వ డివిజన్‌లో శ్రీఅభయ వేంకటేశ్వరస్వామి ఆర్చి రోడ్డులో ఉన్న దేవాలయ సమీప ప్రాంతాన్ని శ్రీఅభయ వేంకటేశ్వర నగర్‌గా పేరు మార్పునకు ప్రతిపాదనలు చేశారు. పాకబండ బజార్‌లోని రెసిడెన్షియల్ ప్రాంతాన్ని కమర్షియల్ ప్రాంతాలుగా మార్పునకు ఆమోదానికి పెట్టనున్నారు.

4లక్షల మిర్చి బస్తాల లెక్కలేవీ?



(ఫైల్)

- ఖమ్మం మార్కెట్‌లో గత వానాకాలం సీజన్ లావాదేవీల్లో తేడాలు
- మార్కెటింగ్ శాఖ ఆన్‌లైన్ పోర్టల్‌లో ఐడీలు మిస్సింగ్
- పంట ఎటు తరలిందో వివరణ ఇవ్వాలంటూ కమీషన్ వ్యాపారులకు నోటీసులు
- మార్కెట్ కార్యాలయం చుట్టూ వ్యాపారుల పరుగులు

ఖమ్మం మార్కెట్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): గత వానాకాలం పంట సీజన్‌కు సంబంధించి ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన లావాదేవీల్లో భారీ తేడాలు ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమయ్యాయి. నాడు కొనుగోళ్లు జరిగిన పంటలో నుంచి సుమారు 4లక్షల మిర్చి బస్తాలు లెక్కల్లోకి రాకుండా పోయాయని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ నిగ్గు తేల్చింది. ఆ బస్తాలు ఏమయ్యాయో? ఎటు తరలించారో? చెప్పాలంటూ ఖమ్మం వ్యవసాయ మార్కెట్ అధికారులకు నోటీసులు పంపింది. దాంతో మార్కెట్ అధికారులు.. వాటికి సంబంధించి వివరణ ఇవ్వాలంటూ సుమారు 400 మంది కమీషన్ వ్యాపారులకు నోటీసులు పంపారు. గాయబ్ అయిన పంటను చిల్లర వ్యాపారులకు అమ్మకాలు జరిపారా? (మిగతా 6వ పేజీలో)

విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొందాం

కలెక్టరేట్‌లో 1077 టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు

ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మం కలెక్టరేట్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉండాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. విపత్తులను ఎదుర్కొనేందుకు కలెక్టరేట్‌లో 1077 టోల్ ఫ్రీ నెంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో వుంచుకొని జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ (గ్రౌండ్ ఫ్లోర్ జి-13)లో 24గంటల పాటు జిల్లా రెవెన్యూ అధికారి పర్యవేక్షణలో, సంబంధిత అధికారుల ఆధ్వర్యంలో పనిచేస్తుందన్నారు. 3 షిప్టులలో సిబ్బంది విధులు నిర్వహిస్తారన్నారు. సహాయ, సహకారాల కోసం వచ్చిన ఫోన్ కాల్స్‌కు అధికారులు స్పందించి, తగిన చర్యలు తీసుకుంటారని కలెక్టర్ తెలిపారు. వరదలు, ఇతర విపత్తుల నేపథ్యంలో ఎటువంటి సహాయ, సహకారాలు అవసరం ఉన్నా, ముఖ్యమైన సమాచారం జిల్లా యంత్రాంగానికి అందించాలన్నా టోల్ ఫ్రీ నెంబర్ 1077కు ఫోన్ చేయాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

యూరియా, డీఏపీ కొరత లేకుండా సరఫరా చేయాలి

ఏఐయూకేఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐయూకేఎస్ నాయకులు

కొత్తగూడెం అర్బన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : వానాకాలం సీజన్‌లో రైతులకు యూరియా, డీఏపీ కొరత లేకుండ సరఫరా చేయాలని ఏఐయూకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కెచ్చల రంగారెడ్డి, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట అఖిలభారత ఐక్యరైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లాలో యూరియా, డీఏపీ, ఎరువుల కొరత లేకుండ చూడాలని, నాణ్యమైన విత్తనాలు, పురుగుల మందులు సరఫరా చేయాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన ప్రభుత్వం, వ్యవసాయ అధికారులు విత్తనాలు, యూరియా, డీఏపీ, ఎరువులకు ఎలాంటి కొరత లేదని అవసరం ఉన్నంత మేర రైతులకు సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. కానీ క్షేత్రస్థాయిలో ఇందుకు భిన్నంగా ఉందన్నారు. అగ్రో సహకార సంఘాలు, డీసీఎంఎస్ కేంద్రాలు, సొసైటీ కార్యాలయాల వద్ద పాస్‌బుక్‌లు చేతపట్టుకుని రైతులు యూరియా కోసం పడిగాపులు కాస్తున్నారని ఆరోపించారు. అక్రమంగా నిల్వ ఉంచిన ఎరువుల దుకాణదారులు అధికారులతో లోపాయికారి ఒప్పందం చేసుకుని రైతులను దోచుకుంటున్నారన్నారు. యూరియా కోటాలో కేంద్ర ప్రభుత్వం కోత పెట్టినట్లు కొందరు అధికారులు చెప్తున్నారని, రాష్ట్రానికి రావాల్సిన కోట సాధించడానికి తెలంగాణ రైతు సంఘాలు కలిసి ఐక్య ఆందోళన చేయాల్సిన అవసరం ఉందని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముద్దా భిక్షం, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బుర్ర వెంకన్న, అమర్లపూడి రాము, ఉపాధ్యక్షులు కల్లూరు కిషోర్, మాచర్ల సత్యం, మాస్‌లైన్ జిల్లా నాయకులు గోకినపల్లి ప్రభాకర్, గొగ్గెల వెంకటేశ్వర్లు, భైరు వెంకన్న, తోటకూరి నరేష్ పాల్గొన్నారు.

లక్ష్యాల సాధనకు సమన్వయంతో పనిచేయాలి

భూసమస్యల పరిష్కారానికి చర్యలు

రెసిడెన్షియల్ పాఠశాలల్లో నాణ్యమైన భోజనం అందించాలి

కలెక్టర్లకు మంత్రుల ఆదేశాలు

ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై వీడియోకాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, జిల్లా అధికారులు

ఖమ్మం కలెక్టరేట్ / కొత్తగూడెం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ లక్ష్యాల సాధనకు అధికారులు సమన్వయంతో పని చేయాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కలెక్టర్లకు ఆదేశాలిచ్చారు. ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలుపై సీఎస్ కె.రామకృష్ణారావుతో కలిసి మంగళవారం వారు సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఖమ్మం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి, భద్రాద్రికొత్తగూడెం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ జితేష్ వి పాటిల్, జిల్లా అటవీశాఖ అధికారి కృష్ణగౌడ్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్ వీసీకి హాజరయ్యారు. ఈ క్రమంలో మంత్రులు భూ భారతి చట్టం అమలు, రెసిడెన్షియల్ విద్యా సంస్థల నిర్వహణ, ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక సరఫరా, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం, వన మహోత్సవం లాంటి ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలుపై సూచనలు చేశారు. భూ భారతి చట్టం రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను ఆగస్టు 15 నాటికి నిబంధనల ప్రకారం పరిష్కరించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వన మహోత్సవం కార్యక్రమం కింద జూలై నెలాఖరు నాటికి నిర్దేశిత లక్ష్యం మేరకు మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రెసిడెన్షియల్ విద్యా సంస్థలలో విద్యార్థులకు అందించే ఆహార నాణ్యత పట్ల అప్రమత్తంగా ఉండాలని, పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని మంత్రులు ఆదేశించారు. జిల్లాల్లోని అసైన్డ్‌ల్యాండ్, లబ్ధిదారుల వివరాలను ఈ నెల 30వ తేదీలోగా ప్రభుత్వానికి పంపించాలని కలెక్టర్లకు సూచించారు. ఈ నెల 27వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా జీపీవోలకు, జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో లైసెన్స్‌డ్ సర్వేయర్లకు పరీక్ష నిర్వహిస్తున్నామని ఇందుకు అవసరమైన ఏర్పాట్లను చేసి, పకడ్బందీగా పరీక్ష నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ కామేపల్లి, ఇల్లందు, సింగరేణి మండలాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక ఇబ్బంది ఉంటే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రులకు వివరించారు. సత్తుపల్లి మండలానికి ముల్కలపల్లి నుంచి ఇసుక తెచ్చుకునేలా సమన్వయంతో పని చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఖమ్మం జడ్పీ సీఈవో దీక్షా రైనా, డీఆర్డీవో సన్యాసయ్య, డీపీవో ఆశాలత, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కళావతి బాయి, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, బీసీ అభివృద్ధి అధికారి జి.జ్యోతి, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీలత, డీడబ్ల్యూవో కె.రాంగోపాల్‌రెడ్డి, కార్మిక, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు. భద్రాద్రి జిల్లా నుంచి డీడీ ట్రైబల్ వెల్ఫేర్ మణెమ్మ, పీడీ హౌసింగ్ రవీంద్రనాథ్, షెడ్యూల్ కులాల సంక్షేమశాఖ అధికారి అనసూయ, బీసీ సంక్షేమ అధికారి ఇందిరా, విద్యాశాఖాధికారి వెంకటేశ్వరచారి, పౌర సరఫరాలశాఖ మేనేజరు త్రినాథ్‌బాబు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానయ్య, జిల్లా వైద్యశాఖాధికారి జయలక్ష్మి, సంబంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్‌తో పాటు జిల్లా అధికార యంత్రాంగం

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న పీవో రాహుల్

దుమ్ముగూడెం జూలై 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆరోగ్యంతో పాటు, పోషకాహారాన్ని అందించడంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నా రు. మంగువాయిబాడవ గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. వర్షాకాలంలో క్రిమికీటకాలు సంచరించే అవకాశం ఉండడంతో రాత్రిపూట విద్యార్థులెవరూ బయటకు రాకుండా చూడాలన్నారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, వంటశాల, ఆహార పదార్థాలు, స్టోర్‌రూంలోని సామగ్రి, లైబ్రెరీలోని పుస్తకాలు, డార్మెటరీలను పరిశీలించారు. ఉద్దీపకం-2ను అమలు చేస్తూ విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని సూచించారు. తరగతి గదిలో విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధిస్తున్న తీరును పరిశీలించారు. మెనూ పాటించాలని, తాజా కూరగాయలతో వండి వడ్డించాలని ఆదేశించారు. కాలంచెల్లిన సరుకులను తొలగించాలన్నారు. అస్వస్థతకు గురైన విద్యార్థులను వెంటనే సమీప పీహెచ్‌సీకు తరలించి వైద్య పరీక్షలు చేయించాలన్నారు. హెచ్ఎం వీరమ్మ, డిప్యూటీ వార్డెన్ నాగేశ్వరావు, టీచర్లు పాల్గొన్నారు.

రామాలయంలో శ్రావణ మాసోత్సవాలివే..

ఆగస్టు 4వ తేదీ నుంచి 9 వరకు పవిత్రోత్సవాలు

ఆ రోజుల్లో పవళింపు సేవ నిలిపివేత

22న లక్ష్మీతాయారు అమ్మవారికి పుష్పాంజలి



భద్రాద్రి రామాలయం

భద్రాచలం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : శ్రావణమాస ఉత్సవాలకు భద్రాచలం సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ఏర్పాట్లు జరుగు తున్నాయి. ఈ క్రమంలో ఉత్సవాల సందర్భంగా జరిగే ప్రత్యేక పూజలు, కార్యక్రమాల వివరాలను దేవస్థానం ఈవో ఎల్.రమాదేవికి స్థానాచార్యులు కేఈ స్థలశాయి మంగళవారం అందజేశారు. ఈ నెల 25న లక్ష్మీ తాయారు అమ్మవారి ఉత్సవమూర్తులకు ప్రత్యేక నవకలశ స్నపన తిరుమంజనం, సామూహిక అష్టోత్తర శతనామార్చన, పట్టాభిషేకం, 28న ఆండాళ్లమ్మవారి తిరునక్షత్రం సందర్భంగా అమ్మవారికి తిరుమంజనం, విశేష భోగ నివేదన, చుట్టు సేవ నిర్వహిస్తారు. 31న చిత్తా నక్షత్రం సందర్భంగా సుదర్శన హోమం. ఆగస్టు ఒకటిన శ్రీ లక్ష్మీ అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, సంధ్యాహారతి ఉంటుంది. ఆగస్టు 4 నుంచి 9 వరకు పవిత్రోత్సవాలను నిర్వహించనుండగా 4న అంకురారోపణం, వాస్తు హోమం, 5న విశ్వక్సేనార్చన, పుణ్యాహవచనం, అగ్నిప్రతిష్ఠ, పవిత్రాధివాసం, అష్టోత్తర శతకలశావాహన ఉంటుంది. 6న ఉత్సవమూర్తులకు అష్టోత్తర శతకలశ స్నపన తిరుమంజనం, పవిత్రారోపణం, హోమం, 7న ప్రత్యేక పవిత్రోత్సవ హోమం నిర్వహిస్తారు. ఈ పవిత్రోత్సవాల సందర్భంగా 4 నుంచి 9వ తేదీ వరకు పవళింపు సేవ రద్దు చేస్తారు. ఇక 5 నుంచి 9 వరకు నిత్యకల్యాణాలు రద్దు చేస్తారు. 8న వరలక్ష్మీ వ్రతం, సామూహిక సహస్రనామ కుంకుమార్చన, 9న హయగ్రీవ జయంతి, 15న సామూహిక కుంకుమార్చన లక్ష్మీతాయారు అమ్మవారికి, ఆగస్టు 20న ఉత్సవమూర్తులకు అభిషేకం, పునర్వసు తిరువీధి సేవ, 21న పట్టాభిషేకం, 22న శ్రీలక్ష్మీ అమ్మవారికి పుష్పాంజలి సేవ, వివిధ రకాల పుష్పాలతో సహస్ర నామార్చన నిర్వహిస్తారు.

భద్రాద్రి దేవస్థానం ఈవో రమాదేవికి ఉద్యోగోన్నతి?



ఎల్.రమాదేవి, ఈవో

భద్రాచలం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎల్.రమాదేవికి ఉద్యోగోన్నతి లభించినట్లు సమాచారం. రెవెన్యూ శాఖలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న ఆమెకు అడిషనల్ కలెక్టర్‌స్థాయి ఉద్యోగోన్నతి లభించినట్లు తెలుస్తోంది. కాగా రెవెన్యూ శాఖలోని పలువురికి ఉద్యోగోన్నతులు లభించినట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన జీవో త్వరలోనే విడుదల కానున్నట్లు రెవెన్యూ వర్గాల ద్వారా తెలుస్తోంది.

ఇల్లెందు, టేకులపల్లి సీఐలుగా సురేశ్, సత్యనారాయణ



తాటిపాముల సురేశ్



బత్తుల సత్యనారాయణ

ఇల్లెందు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పోలీస్ విభాగం మల్టీజోన్ 1లో 8 మంది పోలీసు అధికారులను బదిలీ చేస్తూ మల్టీ జోన్ ఐజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇల్లెందులో సీఐగా పనిచేస్తున్న బత్తుల సత్యనారాయణ టేకులపల్లికి బదిలీ అయ్యారు. ఇల్లెందుకు టేకులపల్లి సీఐ తాటిపాముల సురేశ్‌ను బదిలీ చేశారు. కాగజ్‌నగర్ రూరల్ సీఐగా రిజర్వ్‌డ్‌లో ఉన్న కన్నెం కుమార స్వామి, వెంకటాపురం సీఐగా ముత్యం రమేష్, పస్రా సీఐగా దయాకర్, మెదక్ సీఐగా కే.నాగరాజు నియమితులయ్యారు. కాగా బండారి కుమార్, గడ్డె రవీందర్‌లను రిజర్వ్‌డ్‌లో ఉండగా.. వీరందరూ ఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఇల్లెందులో ఎస్‌హెచ్‌వోగా పనిచేస్తున్న బత్తుల సత్యనారాయణను ఇటీవల ఒక ఎన్ఆర్ఐ భార్యను వేధించిన ఆరోపణలపై తల్లిదండ్రులను విచారించడంలో నిబంధనలను పాటించలేదని ఐజీపీ సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. కాగా సస్పెండ్‌పై పెద్దఎత్తున విమర్శలు రావడం, సస్పెన్షన్‌ను ఎత్తివేయాలంటూ వివిధ సంఘాలు డిమాం చేశాయి. ఈ నేపథ్యంలో సస్పెన్షన్ ఎత్తివేసిన పోలీసు ఉన్నతాధికారులు ఆయనను తిరిగి ఇల్లెందు పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలోనే టేకులపల్లి సీఐగా నియమించడం గమనార్హం.

‘ఎర్త్‌సైన్స్’కు నిధులెలా?

(5వ పేజీ తరువాయి)



కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం

ప్రాంతాల అభివృద్ధికి కేటాయించాల్సిన నిధుల్లో నుంచి.. రాష్ట్ర రాజధాని నడిబొడ్డున ఉన్న చాకలి ఐలమ్మ మహిళా యూనవర్సిటీ నిర్మాణానికి కేటాయించడంపై సింగరేణి కార్మికవర్గాల్లో అసంతృప్తి పెల్లుబుకుతున్నట్టు సమాచారం. ఇలాంటి విధానాలను రద్దు చేయాలని కేవలం సింగరేణి సంస్థ పరిధిలో ఉన్న ప్రభావిత ప్రాంతాల్లోనే డీఎంఎఫ్‌టీ, సింగరేణి సీఎస్ఆర్ నిధులను కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయాన్ని ఇన్‌చార్జ్ వీసీ యోగితా రాణా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వర్సిటీ అభివృద్ధికి కృషి చేయాలని కోరుతున్నారు.

సీఎస్ఆర్ నిధులు... బదలాయింపులు..

సింగరేణి ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి ఆ సంస్థ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ కింద సీఎస్ఆర్ నిధులను కేటాయించాల్సి ఉంది. అయితే ఈ నిధులను 2012 వరకు ప్రభావిత ప్రాంతాలకు మాత్రమే కేటాయించి ఖర్చు చేశారు. ఆ తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎస్ఆర్ నిధులను రాష్ట్రంలోని పరిశ్రమలతో ప్రభావితమైన గ్రామాల అభివృద్ధికి డిస్ట్రిక్ మినరల్ ఫండ్ ట్రస్ట్ (డీఎంఎఫ్‌టీ) కింద తమకు అత్యవసరమైనటువంటి జిల్లాలకు కూడా కేటాయించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే విధానాన్ని అనుసరిస్తోంది. 2014వరకు సింగరేణి, కేటీపీఎస్, నవభారత్, భద్రాచలం పేపర్‌బోర్డు, స్పాంజ్‌ఐరన్, భారజాల కర్మాగారం లాంటి సంస్థలు జిల్లాలో ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి కోసం సీఎస్ఆర్ పాలసీ కింద నిధులు కేటాయించి ఆ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేశారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన ఆ పరిస్థితి మారింది. వాస్తవానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పెట్టుబడులతో సింగరేణి సంస్థ నడుస్తోంది. సీఎస్ఆర్ ఫండ్స్ వినియోగంలో కూడా సంయుక్తంగా సంస్థ నిర్ణయాలు తీసుకునే వారు. అందుకు భిన్నంగా సింగరేణి సీఎస్ఆర్ నిధుల బదలాయింపులు చేయడం పట్ల కార్మికవర్గాల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. సింగరేణి సంస్థ సీఎస్ఆర్ ఫండ్ కేవలం సింగరేణి ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి మాత్రమే కేటాయించాలని కార్మికులు సంస్థకు విజ్ఞప్తి చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ 16 ఈ నెల 8వ తేదీన డీఎంఎఫ్‌టీ పేరుతో కొత్త నిబంధనలను తీసుకొచ్చింది. ఆ కమిటీల ద్వార నిధులు ప్రభావిత ప్రాంతాలకే వినియోగించాలని ఒక గెజిట్‌ను కూడ రూపొందించింది. సింగరేణి పరిసరాల ప్రాంతాలకు తలమానికంగా నిలిచిన కొత్తగూడెంలో నూతనంగా నిర్మించనున్న డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఎర్త్‌సైన్స్ యూనివర్శిటీకి అవసరమైన నిధులు సింగరేణి సంస్థే భరించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తోన్నారు.

4లక్షల మిర్చి బస్తాల లెక్కలేవీ?

(5వ పేజీ తరువాయి)



కోల్డ్‌స్టోరేజీకి తరలించారా? లేక రైతులు మార్కెట్‌కు తీసుకొచ్చాక పంట అమ్ముడు పోక తిరిగి ఇంటికి తీసుకెళ్లారా? కటింగ్ బిల్లుల వల్ల తేడాలు వస్తున్నాయా? అనే కోణాల్లో వివరణ అడిగారు. పంట కొనుగోలు జరగక పోతే వారి వారి ఐడీలు ఎందుకు రద్దు చేసుకోలేదో? పంట బయటకు తరలించినపుడు మార్కెట్ డేటా ఎంట్రీ సిబ్బందికి ఎందుకు తెలియపరచలేదో తెలపాలని నోటీసుల్లో పేర్కొన్నారు. కమీషన్ వ్యాపారులు ఇలాంటి అశ్రద్ధ మరోసారి చేయకుండా ఉండాలంటూ మార్కెట్ అధికారులు సీరియస్‌గా చెప్పారు. ఇదిలా ఉండగా ఆ నోటీసులకు వివరణ ఇవ్వడానికి కమీషన్ వ్యాపారులు మార్కెట్ కార్యాలయం చుట్టూ పరుగులు పెడుతున్నారు.

దురుద్దేశ కోణంలోనూ ఆరా

మార్కెట్‌లో ఒక కమీషన్ వ్యాపారి అడ్డాలో పంట దిగుమతి అయిన తరువాత సదరు కమీషన్ వ్యాపారి డేటా ఎంట్రీ కార్యాలయంలో రైతు వివరాలు, తీసుకొచ్చిన బస్తాలు నమోదు చేసి ఐడీ నెంబర్ పొందుతాడు. అనంతరం పంట కొనుగోలు దారులు కొనుగోలు చేస్తే ఆన్‌లైన్ ద్వారా కాంటా పట్టీపై కాంటాల వివరాలు తెలుసుకోగలుగుతాడు. ఒక వేళ ఆ పంటను ఎవరూ కొనుగోలు చేయకపోతేనో, రైతు తిరిగి ఇంటికి కానీ, కోల్డ్‌స్టోరేజీకి కానీ పంటను తీసుకెళితేనో సదరు కమీషన్ ఏజెంటు ఆ పంట తాలూకా ఐడీని రద్దు చేసుకోవాలి. అంతే కాకుండా పంటను కమీషన్ వ్యాపారే కొనుగోలు చేసి పంటను ఎవరూ కొనుగోలు చేయలేదని ఆపంటను ఉద్దేశ్యపూర్వకంగా బయటకు తరలించడం లాంటి దురుద్దేశ కోణాలు ఏమైనా ఉన్నాయా? అని మార్కెట్ అధికారులు ఆరా తీస్తున్నారు. ఇదిలా ఉంటే అసలు మార్కెట్ సిబ్బంది ప్రమేయం లేకుండా పంట గేటు బయటకు ఎలా వెళ్లిందని వ్యాపారులు ప్రశ్నిస్తుండటం విశేషం.

కమీషన్ వ్యాపారులు నిబంధనలు పాటించాలి

పి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి



ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

మార్కెట్‌లో కమీషన్ వ్యాపారం చేసే ప్రతీ కచ్చితంగా ఒక్కరు మార్కెట్ నిబంధనలకు లోబడి లావాదేవీలు జరపాలి. ప్రస్తుతం ఉన్న ఆన్‌లైన్ వ్యవస్థలో ఎలాంటి అశ్రద్ధకు, అవకతవకలకు తావు ఇవ్వొద్దు. తక్‌పట్టీ దగ్గర్నుంచి, ఐడీలు ఎంట్రీ, క్యాన్సిల్ వరకు నిక్కచ్చిగా వ్యవహరించాలి. రైతులకు చెల్లింపు చేసే విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలి. మరోసారి ఐడీ మిస్సింగ్‌లు జరగకుండా చూసుకోవాలి.

జల్సాలకు అలవాటై.. చెడు వ్యసనాలకు బానిసై..

ఏడున్నర కిలోల గంజాయితో పట్టుబడిన మైనర్

ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా స్వస్థలం

వివరాలు వెల్లడించిన కల్లూరు ఏసీపీ రఘు



సత్తుపల్లిలో వివరాలు వెల్లడిస్తున్న కల్లూరు ఏసీపీ రఘు

సత్తుపల్లి, జూలై22 (ఆంధ్రజ్యోతి): అతడు మైనర్.. వయసు 17ఏళ్లు.. తొలుత జల్సాలకు అలవాటు పడ్డాడు. క్రమంగా చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. చివరకు 7.56 కిలోల గంజాయితో పట్టుబడ్డాడు ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఓ 17ఏళ్ల బాలుడు. మంగళవారం సత్తుపల్లిలో అతడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు అతడి నుంచి గంజాయిని, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి కల్లూరు ఏసీపీ అనిశెట్టి రఘు వివరాలు వెల్లడించారు. జల్సాలకు అలవాటు పడిన ఆ బాలుడు స్నేహితులతో కలిసి ద్విచక్రవాహనాలను దొంగతనం చేయడంతో పాటు ఒరిస్సా నుంచి గంజాయిని కొనుగోలు చేస్తుంటాడు. ఆ గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లలో నింపి రూ.500చొప్పున విక్రయిస్తుంటాడని తెలిపారు. ఈ క్రమంలో సూర్యాపేట, మధిరకు చెందిన ఇద్దరు స్నేహితులతో కలిసి గంజాయి కొనుగోలు చేసేందుకు విజయవాడలో దొంగతనం చేసిన మోటారు సైకిల్‌పై సోమవారం ఒరిస్సాకి బయల్దేరి వెళ్లారు. అక్కడ ఓ వ్యక్తి వద్ద నుంచి 7.56కేజీల గంజాయిని కొనుగోలు చేసి స్వగ్రామాలకు బయల్దేరారు. ఈ క్రమంలో పట్టుబడిన బాలుడు.. తాను ద్విచక్రవాహనంపై సత్తుపల్లి మీదుగా వెళ్తానని చెప్పి మిగతా ఇద్దరు స్నేహితులను బస్సులో పంపించాడు. అతడు సత్తుపల్లి మీదుగా ద్విచక్ర వాహనంపై ఎన్టీఆర్ జిల్లా వైపు వెళ్తుండగా మంగళవారం ఉదయం సత్తుపల్లి ఎస్ఐ ప్రదీప్ ఆధ్వర్యంలో స్థానిక నీలాద్రి అర్బన్ పార్క్‌వద్ద పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు చిక్కా డు. పోలీసులు బాలుడిని ఆపి.. అతడి వద్ద సరైన పత్రాలు లేవని గుర్తించారు. అంతేకాకుండా అతడి తీరుపై అనుమానం వచ్చి తనిఖీ చేయగా 7.560కేజీల గంజాయి లభ్యమైంది. దీంతో బైకును సీజ్ చేసి.. బాలుడిని జువైనల్ జస్టిస్ కోర్టు ఎదుట హాజరు పరుస్తామని ఏసీపీ చెప్పారు. ఎవరైనా గంజాయి పీల్చినా, అమ్మినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో పట్టణ సీఐ టి.శ్రీహరి, ఎస్ఐ ప్రదీప్ పాల్గొన్నారు.

యువతి, యువకుడి ఆత్మహత్య

ఖమ్మం జిల్లా పండితాపురంలో విషాదం

ప్రేమ వ్యవహారమే కారణమని గ్రామంలో చర్చ



హారిక (ఫైల్)



శ్రీకాంత్ (ఫైల్)

కారేపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ఒకే గ్రామానికి చెందిన ఓ యువతి ఉరేసుకోగా.. కొద్దిసేపటికే అదే గ్రామానికి చెందిన యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం పండితాపురం గ్రామంలో మంగళవారం సాయంత్రం జరిగింది. గ్రామానికి చెందిన బండి హారిక (20) తన ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన జరిగిన కొద్దిసేపటికే ఎదురింట్లో ఉండే గాడేపల్లి శ్రీకాంత్(24) ఇంట్లోనే పురుగులమందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటనలు గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపగా.. హారిక పదోతరగతి వరకు చదివి ఇంటి వద్దే ఉంటుండగా.. శ్రీకాంత్ డిగ్రీ పూర్తి చేసి ఆటో నడుపు కొంటున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనలపై ఎలాంటి కేసులు నమోదు కాలేదని కారేపల్లి సీఐ తిరుపతిరెడ్డి తెలిపారు. అయితే వీరిద్దరి మరణాలకు ప్రేమ వ్యవహారమే కారణమని స్థానికులు చర్చించుకుంటున్నారు.

4, 5 తేదీల్లో.. పాఠశాలలకు ఆడిట్ బృందాలు

గతేడాది ఒక్కో బడికి రూ.25వేల నుంచి రూ.లక్ష వరకు విడుదల

కొన్ని స్కూళ్లలో కానరాని పరికరాలు, వసతులు



కొత్తగూడెం ఎడ్యుకేషనల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, తదితర అవసరాల కోసం విడుదల చేసిన నిధుల ఖర్చుల వివరాలను పరిశీలించేందుకు ఆగస్టు 4, 5 తేదీల్లో ఆడిట్ బృందాలు పాఠశాలలకు రానున్నాయి. 2024 - 25 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు రూ.25 వేల నుంచి రూ.లక్ష వరకు నిధులు మంజూరు చేశారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, క్రీడా సామగ్రి, యూత్ ఎకో క్లబ్స్ బడిబాట నిర్వహణ కోసం ఈ నిధులను విడుదల చేశారు. కొన్ని పాఠశాలల్లో నామమాత్రంగా సామగ్రి కొనుగోలు చేసి ఫేక్ రశీదులతో ఆడిట్‌కు హాజరు అవుతారు. మరి కొందరు పాఠశాల సొమ్ము జేబులోక్లికి మళ్లిస్తారు. ఎక్కువ మంది ప్రధానోపాధ్యాయులు మాత్రం నిబంధనల ప్రకారం వస్తువులు కొనుగోలు చేసి ఒరిజినల్ బిల్లులు అందజేస్తారు. వీటన్నిటిని తనిఖీ చేసేందుకు ఆడిట్ బృందాలు జిల్లాకు రానున్నాయి. 2024 - 25సంవత్సరంలో భద్రాద్రి జిల్లాలోని 1,514 పాఠశాలలకు వివిధ రకాల నిధులు విడుదల చేశారు. బడిబాట కోసం రూ.1,000, స్కూల్ గ్రాంట్స్ రెండు దశల్లో రూ. 50వేలు, స్పోర్ట్స్ పరికరాల కోసం రూ. 50వేలు, యూత్ ఎకో క్లబ్స్ కోసం రూ. 5వేలు, ఏక్ భారత్ - శ్రేష్ట్ భారత్ కింద రూ. 1,000, సేఫ్టీ సెక్యూరిటీకోసం రూ. 500 చొప్పున ఇచ్చారు. ప్రాథమిక పాఠశాలకు ఒక్కో దానికి విద్యార్థుల సంఖ్య ఆధారంగా రూ.20వేల నుంచి రూ.40వేల వరకు విడుదల చేశారు. ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా రూ.70వేల నుంచి రూ.1.25లక్షల వరకు నిధులు విడుదల చేశారు. పాఠశాల కమిటీ ద్వారా ఈ నిధులు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ప్రధానోపాధ్యాయులు, సీనియర్ ఉపాధ్యాయులు జాయింట్ అకౌంట్ ద్వారా బ్యాంకుల నుంచి నిధులు విడుదల చేసుకునే అవకాశం ఉంటుంది. అమ్మ ఆదర్శ పాఠశాల నిధులు కమిటీ చైర్మన్, పాశాల హెచ్ఎం జాయింట్ ఎకౌంట్ ద్వారా డ్రా చేయాల్సి ఉంటుంది.

బిల్లులు బరాబర్.. మరి వస్తువులు ?

పాఠశాలలకు విడుదలయ్యే నిధులు పక్క దోవపడుతున్నాయనే ఆరోపణలున్నాయి. కొన్ని పాఠశాలల్లో నిబంధనల అనుకూలంగా స్పోర్ట్స్ పరికరాలు కొనుగోలు చేశారు. మరి కొందరు ప్రధానోపాధ్యాయులు నాసిరకం వస్తువుల పర్సంటేజీల కోసం కొనుగోలు చేస్తున్నారు. మరి కొన్ని పాఠశాలల్లో వస్తువులు కనిపించవు కానీ బిల్లులు మాత్రం నిబంధనల ప్రకారం బిల్లులు సిద్ధం చేసుకుంటారు. మరికొందరు ఏకంగా ఫేక్ బిల్లులు పెడతారు. అయితే జీఎస్టీ నెంబర్ గల బిల్లులను రూపొందించడం గమనార్హం. గతంలో కంటే ప్రస్తుతం పాఠశాలలకు ఎక్కువ నిధులు వస్తున్నాయి. ఆట వస్తువుల కొనుగోళ్లలో అవకతవకలు జరుగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. క్రీడా సామగ్రి కోసం ఒక్కో పాఠశాలకు రూ.12వేల నుంచి రూ.50వేల వరకు నిధులు విడుదల చేశారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల సౌకర్యాల కోసమే ఈ నిధులు ఖర్చు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

పనులు, నిధులు.. పెండింగ్

- ఫలితమివ్వని 'మన ఊరు- మనబడి'
- రెండేళ్లుగా నిధుల కోసం నిరీక్షణ
- భద్రాద్రి జిల్లాలో రూ. 11.60కోట్లు పెండింగ్
- పట్టించుకోని అధికార యంత్రాంగం

కొత్తగూడెం ఎడ్యుకేషన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం పాలనాకాలం చివరలో సర్కారు పాఠశాలల అభివృద్ధి కోసం మన ఊరు - మనబడి పేరుతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 368 పాఠశాలలను ఎంపిక చేసి.. వివిధ రకాల 1921 పనులను హడావుడిగా ప్రారంభించింది. ఆర్‌అండ్‌బీ, గిరిజన సంక్షేమం, నీటిపారుదల, పంచాయతీరాజ్ తదితర శాఖలకు ఆ పనులను అప్పగించింది. కానీ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఈ పనులకు నిధులను నిలిపేసి.. అమ్మ ఆదర్శ పాఠశాల పథకం తెరమీదకు తీసుకొచ్చింది. దాంతో కాంట్రాక్టర్ల బిల్లులే కాకుండా పాఠశాలల్లో పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఇటీవల కాంట్రాక్టర్లు నిధుల విడుదల కోసం ఆందోళనలు కూడా చేపట్టారు. పాఠశాలల్లో మరుగుదొడ్లు, ప్రహరీలు, తాగునీటి ట్యాంకులు, తరగతి గదుల మరమ్మతులు, విద్యుత్ తదితర పనులు పెండింగ్‌లో పడ్డాయి. దాంతో ప్రధానోపాధ్యాయులు అయోమయంలో పడ్డారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా పథకాలు మారడం వల్ల విద్యా వ్యవస్థ కుంటుపడుతోందని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భద్రాద్రి జిల్లాలో 368 పాఠశాలల్లో 1921 పనులుచేపట్టగా దీనిలో 1186 పనులు పూర్తయ్యాయని, 326 పనులు చేపట్టగా దీనిలో 1186 పనులు పూర్తయ్యాయని, 326 పనులు నిర్మాణ దశలో ఉండగా, 276 పనులు మూడు వంతులు, 133 పనులు అసలు ప్రారంభించలేదని లెక్కలు చెబుతున్నాయి. అత్యధిక పనులు ఇల్లెందు, దమ్మపేట, దుమ్ముగూడెం, టేకులపల్లి మండలాల్లో చేపట్టారు. ఒక్క మణుగూరు మండలంలోనే నూరుశాతం పనులు పూర్తి చేశారు. ఇక ఒక్క భద్రాద్రిజిల్లాలోనే రూ. 11.60 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. బిల్లుల కోసం కాంట్రాక్టర్లు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

పెండింగ్ పనుల పూర్తి కోసం నిరీక్షణ..

ఎం.వెంకటేశ్వర చారి, భద్రాద్రి జిల్లా విద్యాశాఖాధికారి

2023-24 నుంచి మన ఊరు- మనబడి పథకం కింద చేపట్టిన 602 పనులు నిలిచిపోయాయి. వాటికి నిధులు రాగానే పూర్తి చేస్తాం. ప్రస్తుతం జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాల పథకం అమలవుతుంది. కమిటీల ద్వారా పనులు జరుగుతున్నాయి. పెండింగ్ పనులు పూర్తి కావడానికి దాదాపు రూ.11.60కోట్లు అవసరం ఉంటుంది.

ఉపాధ్యాయులు ఎక్కువ..
ప్రమాణాలు తక్కువ

- మిగులు ఉపాధ్యాయులు 497 మంది
- విద్యార్థుల 'భవిత'కు భరోసా ఏదీ?



కొత్తగూడెంలోని భవిత కేంద్రం

కొత్తగూడెం ఎడ్యుకేషన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి జిల్లాలో సౌకర్యాలు, ఉపాధ్యాయులు అవసరానికి మించి ఉన్నా పిల్లల్లో విద్యా ప్రమాణాలు మాత్రం పెరగడం లేదన్న అపవాదు ఉంది. కలెక్టర్ విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపడమే కాకుండా అవసరమైన ప్రణాళిక, నిధులు కేటాయిస్తున్నా.. కిందిస్థాయి ఉద్యోగుల పని తీరు సక్రమంగా లేకపోవడం వల్ల సరైన ఫలితాలు రావడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వేసవికాలంలో ప్రత్యేక పాఠశాలలు, ఉపాధ్యాయులకు శిక్షణలు, పాఠశాలలకు అవసరమైన నిధులు, మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నా సరైన పర్యవేక్షణలు లేకపోవడం ప్రధాన కారణంగా స్పష్టమవుతోంది. పరక్ రాష్ట్రీయ సర్వేక్షన్ 2024 నివేదికలో భద్రాద్రి జిల్లాలో పాఠశాల విద్యార్థుల విద్యాప్రమాణాలు 50శాతం మించి లేవని స్పష్టం కావడమే ఇందుకు నిదర్శనం. జిల్లాలో అసలు పిల్లలు లేని పాఠశాలలు 12, సింగిల్ డిజిట్ పాఠశాలలు 81 ఉన్నాయి. వర్క్ ఎడ్జెస్ట్‌మెంట్ కోసం గణంకాలు తీస్తే జిల్లాలో 497మంది ఉపాధ్యాయులు మిగులు (సర్ప్లెస్) ఉన్నారు. వీరందర్నీ అవసరమైన పాఠశాలలకు, ఏజెన్సీ మారుమూల ప్రాంతాల్లో సర్దుబాటు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

భవిత కేంద్రాల మాటేంటి?

ప్రత్యేక అవసరాల పిల్లల కోసం భద్రాద్రి జిల్లాలోని 23మండలాల్లో భవిత కేంద్రాలు ఏర్పాటు చేయగా 2,425 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఏడేళ్లుగా ఈ కేంద్రాలకు సరైన భవనాలు, మౌలిక సదుపాయాలు లేక అనేక ఇబ్బందులకు గురయ్యారు. 23 కేంద్రాల్లో 17 కేంద్రాలను పాఠశాలల్లోనే నడుపుతున్నారు. ఆరుచోట్ల భవనాలున్నా.. సరైన మరుగుదొడ్లు, సౌకర్యాలు లేవు. అవి శిధిలావస్థలో ఉండటంతో విద్యార్థులు ఈ పాఠశాలల్లో చేరడానికి అంతగా ఆసక్తి చూపడం లేదు. భవితా కేంద్రాల్లో అన్ని రకాల వస్తువులు ఉన్నా ఉపాధ్యాయులు అంతగా ఉపయోగించడం లేదని తెలుస్తోంది. కలెక్టర్‌గా జితేష్ వి పాటిల్ పదవీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి భవిత కేంద్రాల భవన నిర్మాణాలకు ఒక్కొక్క దానికి రూ.7లక్షలు, మరుగుదొడ్లకు రూ.లక్ష, భవన మరమ్మతులకు రూ.లక్షన్నర మంజూరు చేశారు. ఇంకా వీటి పనులు కార్యరూపం దాల్చలేదని తెలుస్తోంది.

మనోవేదనతో వృద్ధురాలి ఆత్మహత్య

జూలూరుపాడు, జూలై 22(ఆంధ్రజ్యోతి): మనోవేదనకు గురై ఓ వృద్ధురాలు పురుగులమందు సేవించి ఆత్మహత్యకు పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బేతాళపాడు పంచాయతీ పంతులతండా గ్రామానికి చెందిన ధారావత్ కాంతి(70) రెండేళ్ల క్రితం పక్షవాతం బారిన పడి కుమారుడు శ్రీను ఇంటి వద్దనే ఉంటుంది. కొన్ని రోజులుగా జీవితంపై తనకి విరక్తి కలుగుతుందని ఆమె మనోవేదన చెందుతుంది. కాగా కుటుంబసభ్యులు ఆమెకు నచ్చచెప్పుకుం టూ వస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 18న కుమారుడు, కోడలు పొలానికి వెళ్లిన సమయంలో ఆమె ఇంట్లోనే పురుగుల మందు సేవించింది. వారు పొలం నుంచి ఇంటికి తిరిగి వచ్చేసరికి అపస్మారకస్థితిలో ఉంది. దీంతో ఆమెను వెంటనే కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మృతురాలి కుమారుడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ దయానంద్ తెలిపారు.

20 ట్రక్కుల ఇసుక నిల్వల సీజ్

బూర్గంపాడు, జూలై 22(ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 20ట్రక్కుల ఇసుక డంప్‌ను సారపాకలో మంగళవారం తహసీల్దార్ కేఆర్‌కేవీ ప్రసాద్ సిబ్బందితో కలిసి సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారపాక గ్రామపంచాయతీ పరిధిలోని భాస్కర్‌నగర్ ప్రాంతంలో ఎలాంటి అనుమతి లేకుండా ఉన్న ఇసుక నిల్వలను పరిశీలించి సీజ్ చేసినట్లు తెలిపారు. ఎవరైనా అనుమతులు లేకుండా అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్ఐ నరసింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.

భగత్‌సింగ్ నగర్‌లో కార్డెన్‌సెర్చ్

- పలు వాహనాల పట్టివేత
- రూ. 25వేల మద్యం స్వాధీనం



మాట్లాడుతున్న డీఎస్పీ రవీంద్రరెడ్డి

మణుగూరు టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్‌లో మణుగూరు డీఎస్పీ రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు తనిఖీల్లో 42 ద్విచక్ర వాహనాలు, నాలుగు ఆటోలు, రూ. 25 వేల విలువ గల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ రవీంద్రరెడ్డి మాట్లాడుతూ.. ఎవరైనా అపరిచిత వ్యక్తులు వచ్చినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై అనుమానం ఉన్నా, నిషేధిత గంజాయి, అమ్మినా కొనుగోలు చేసినా, వెంటనే పోలీసులకు తెలపాలన్నారు. కార్యక్రమంలో సీఐలు పాటి నాగబాబు, అశోక్ రెడ్డి, ఎస్ఐలు సు రేష్, మధు ప్రసాద్, రంజిత్ మనీషా పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులకు వ్యక్తి అప్పగింత



మణిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న అన్నం శ్రీనివాసరావు

ఖమ్మం ఖానాపురంహవేలి, జూలై 22(ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం కోల్పోయి రోడ్లవెంట తిరుగుతున్న తమిళనాడుకు చెందిన ఓ వ్యక్తిని వైద్య సేవల అనంతరం తమిళనాడులోని ఆయన కుటుంబ సభ్యులకు అన్నం శ్రీనివాసరావు ఫౌండేషన్ సభ్యులు అప్పగించారు. వివరాల ప్రకారం..గత డిసెంబరు 23న ఖమ్మం పట్టణం లాకారం పార్క్ సమీపంలో ఓ 47ఏళ్ల వ్యక్తి ప్రజల మీద రాళ్లు రువ్వుతూ భయభ్రాంతులకు గురిచేస్తుంటే ఖమ్మం 1వ పట్టణ పోలీసులు అన్నం సేవా ఫౌండేషన్ వారికి సమాచారం అందించారు. అన్నం శ్రీనివాసరావు ఘటనా స్థలానికి వెళ్లి ఆ వ్యక్తిని పట్టుకొని ఆశ్రమానికి తీసుకువచ్చి వైద్యం చేయించారు. సుమారు ఏడే నెలల తర్వాత కోలుకొని తన పేరు మణి అని, తమిళనాడు రాష్ట్రం త్రిచురపల్లి జిల్లా విదుతలైపురం గ్రామం అని తమిళంలో తన వివరాలు తెలిపాడు. దాతల సహకారంతో సోమవారం అన్నం ఫౌండేషన్ అంబులెన్స్‌లో మంగళవారం అతని స్వస్థలమైన విదుతలైపురం గ్రామంలో అతని భార్య లలిత, కుమారుడు మోహన్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా అన్నం శ్రీనివాసరావుకు అతని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నం సేవా ఫౌండేషన్ సభ్యులు మెట్టు బుజ్జిబాబు, లాలయ్య పాల్గొన్నారు.

ఫేక్ ఐడీలు క్రియేట్ చేసిన వ్యక్తి అరెస్ట్

కామేపల్లి, జూలై 22(ఆంధ్రజ్యోతి): అమ్మాయిల ఫేక్ ఐడీలు సృష్టించి, డబ్బులు అర్జిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసిన ఘటన మండలం మద్దులపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మద్దులపల్లికి చెందిన గడ్డబోయిన హరీష్ తన ఫోన్‌లో అమ్మాయిల ఫేక్ ఐడీలు ఇన్‌స్టాగ్రాం సృష్టించి తనకు ఎవరు లేరని, చదువుకునేందుకు ఫీజు సహాయం చేయండి అంటూ చాటింగులు చేస్తుండేవాడు. దీంతో పాటు డబ్బులు వసులు చేస్తూ, వేరే వ్యక్తుల ఖాతాలు తెరచి వారికి తెలియకుండానే వారి ఖాతాలో డబ్బులు తీసేవాడని, ఫిర్యాదు అందడంతో ఎస్ఐ సాయికుమార్ కేసు నమోదు చేశారు. సీఐ తిరుపతిరెడ్డి విచారణ చేపట్టి అతడిని అరెస్ట్ చేశారు. అతడి దగ్గర ఉన్న మొబైల్‌ను, బైక్ ట్రాలీని కూడా సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

రహదారి నిర్మాణంపై ఫిర్యాదు

దమ్మపేట, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని మొద్దులగూడెం గ్రామం పరిధిలోని చింతల చెరువు అలుగుపై ఓ రైతు అక్రమంగా తూరలు వేసి రహదారి ఏర్పాటు చేయడంతో ఆయకట్టు రైతులు మంగళవారం నీటిపారుదల అధికారులకు ఫిర్యాదు చేశారు. వివరాల ప్రకారం.. చింతల చెరువు మెరక అలుగుపై ఓ రైతు అక్రమంగా సిమెంట్ పైపులు వేసి రహదారి నిర్మాణం చేపట్టాడు. దీంతో చెరువులోకి వర్షాకాలం అధికంగా నీరు వస్తే చెరువు తెగిపోతుందని, దీనిపై చర్యలు తీసుకొని అక్రమంగా పైపులు వేసి నిర్మించిన రహదారిని తొలగించాలని నీటిపారుదల శాఖ ఈఈ సురేష్‌కుమార్‌కు రైతులు ఫిర్యాదు చేశారు. ఈవిషయంపై ఈఈ సురేష్ కుమార్ వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

ఫ్లోరిడా యూనివర్సిటీ సెమినార్‌కు మైత్రి

- మొక్కజొన్న పంటపై చేసిన పరిశోధనను వివరించనున్న మూటాపురం విద్యార్థిని



నేలకొండపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : మొక్కజొన్న పంటపై చేసిన పరిశీలన గురించి ఫ్లోరిడా యూనివర్సిటీలో జరుగుతున్న సెమినార్‌లో వివరించే అరుదైన అవకాశాన్ని దక్కించుకున్నారు నేలకొండపల్లి మండలం మూటాపురం గ్రామానికి చెందిన బిక్కసాని మైత్రి. అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రంలోని యూనివర్సిటీ ఆఫ్ ఫ్లోరిడాలో 21వ తేదీ నుంచి 24 వరకు 20వ అంతర్జాతీయ సైలేజ్ కాన్ఫరెన్స్ జరుగుతుండగా.. పంజాబ్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేస్తున్న మైత్రి హాజరవుతున్నారు. మూటాపురం గ్రామానికి చెందిన మైత్రి ఖమ్మంలో ఇంటర్ వరకు చదివి.. హైదరాబాద్ శ్రీకొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో బీఎస్సీ హార్టీకల్చర్, తిరువనంతపురంలోని కేరళ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఎమ్మెస్సీ అగ్రికల్చర్ పూర్తి చేశారు. హైదరాబాద్‌లోని భారత చిరుధాన్యాల పరిశోధన కేంద్రం(ఐఐఎమ్మార్)లో ఎస్ఆర్ఎఫ్‌గా ఎంపికై ఏడాది పాటు పని చేసిన అనంతరం పంజాబ్ రాష్ట్రంలోని లూధియానా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జెనిటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్ విభాగంలో పీహెచ్‌డీ ప్రవేశం పొందారు. మొక్కజొన్నను మెరుగైన పశుగ్రాసంగా అభివృద్ధి పర్చటంలో పరిశోధన చేస్తున్న ఆమెకు 2022లోనే టెక్సాస్‌లోని ఏఅండ్ఎం విశ్వ విద్యాలయంలో స్కాలర్‌షిప్‌తో పీహెచ్‌డీలో ప్రవేశం దొరికినా.. స్వదేశంలోనే పీహెచ్‌డీని పూర్తి చేయాలన్న లక్ష్యంతోనే పంజాబ్‌లో పీహెచ్‌డీ చేస్తున్నారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వ సైన్స్‌అండ్‌టెక్నాలజీ విభాగానికి చెందిన సైన్స్‌అండ్‌ఇంజనీరింగ్ రీసెర్చ్ బోర్డ్(ఎస్ఈఆర్‌బీ), భారత వాణిజ్య మండలి (సీఐఐ) సంయుక్తంగా పరిశోధనలను ప్రోత్సహించటానికి ఇచ్చే ప్రధాన మంత్రి ఫెలోషిప్‌కు కోర్టేవాఅగ్రి సైన్స్ సంస్థ సహకారంతో తన పరిశోధనను కొనసాగిస్తున్నారు. అయితే మైత్రి ఫ్లోరిడా సెమినార్‌కు వెళ్లివచ్చేందుకు, వసతుల ఖర్చును యూనివర్శిటీ వారే భరిస్తున్నారు. ప్రపంచ స్థాయిలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, ప్రముఖ శాస్త్రవేత్తలు పాల్గొనే సమావేశాల్లో పాల్గొనే అవకాశం దక్కటం తన అదృష్టమని మైత్రి అన్నారు. తాను పరిశోధనల్లో మరింత ముందుకెళ్లడానికి ఈ ప్రోత్సాహం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని చెబుతున్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

- భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్



సులానగర్ పీహెచ్‌సీలో వైద్యసిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

టేకులపల్లి, జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని, ప్రాథమిక వైద్యసేవలు నిరంతరం అందుబాటులో ఉండేవిధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మంగళవారం మండలంలోని సులానగర్ పీహెచ్‌సీ, రాంపురం పంచాయతీ పరిధిలోని పాతతండా ప్రాథమిక పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందుతున్న వైద్యసేవలు, మౌలిక సదుపాయాలు, పరిశుభ్రత, సిబ్బంది హాజరు, రోగుల రిజిష్టర్లు, డాక్టర్ల హాజరు పత్రాలు, ల్యాబ్, రికార్డులను పరిశీలించారు. తనిఖీ సమయంలో పీహెచ్‌సీ వైద్యాధికారి దినేష్ బద్దుతండాలోని ఏకలవ్యపాఠశాలలో జరుగుతున్న వైద్యశిబిరంలో ఉండటంతో కలెక్టర్ ఫోన్‌లో ఆయనతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆస్పత్రి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ వైద్యకేంద్రాలపై ప్రజల్లో నమ్మకం పెరగాలంటే సేవల నాణ్యతతో పాటు బాధ్యతాయుతంగా వ్యవహరించడం ఎంతో అవసరమన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కావల్సిన పరికరాలు, చేపట్టవలిసిన అభివృద్ధి పనులపై నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు రాంపురం పంచాయతీ పరిధిలోని పాతతండా ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. పాఠశాల విద్యాప్రమాణాలు, మౌలికవసతులు, శుభ్రత, ఉపాధ్యాయుల హాజరు తదితర అంశాలను పరిశీలించారు. కలెక్టర్ విద్యార్థులతో ముచ్చటించారు. వారి పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను పరిశీలించారు. తెలుగు రాయడం, చదవడాన్ని ప్రత్యేకంగా పరీక్షించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థుల్లో అభ్యాసనంపై ఆసక్తిపెంపొందిచే విధంగా బోధన సాగాలన్నారు. పాఠశాల ప్రాంగణం పరిశుభ్రంగా ఉంచాలని, తాగునీటి సదుపాయం, విద్యుత్, మరుగుదొడ్ల వంటి మౌలిక వసతులను ఎప్పటికప్పుడు నిర్వహించాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యం ఎక్కువగా ఉండటం తరగతి గదులు తక్కువగా ఉండటాన్ని గమనించిన కలెక్టర్ అదనపు తరగతి గదుల నిర్మాణానికి తగిన ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

వృద్ధురాలిపై హత్యాయత్నం

ఎర్రుపాలెం, జూలై22(ఆంధ్రజ్యోతి): తీసుకున్న అప్పు ఇవ్వమని అడిగినందుకు ఓ యువకుడు ఒంటరిగా నివసిస్తున్న వృద్ధురాలిపై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని మొలుగుమాడు గ్రామానికి చెందిన రేళ్లచర్ల పద్మావతి (56)కి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇద్దరికి పెళ్లయి, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తూ అమెరికాలో స్థిరపడ్డారు. 20 ఏళ్లక్రితమే భర్త సత్యనారాయణ చనిపోవడంతో ఒంటరిగా జీవిస్తుంది. అదే గ్రామానికి చెందిన రేళ్లచర్ల నర్సయ్య అనే యువకుడు పద్మావతికి కొడుకు వరుసైన దూరపు బంధువు. చుట్టరికం దృష్ట్యా ఆమె వ్యక్తిగత పనుల్లో సాయం చేస్తుంటాడు. గతేడాది ఆమె వద్ద రూ.50వేలను తన అవసరాల నిమిత్తం అప్పుగా తీసుకున్నాడు. గత కొద్దికాలంగా అప్పు తీర్చాలని పద్మావతి నరసయ్యను పలుమార్లు అడిగింది. కాగా పద్మావతిని లేకుండా చేస్తే తన అప్పు తీర్చాల్సిన అవసరం ఉండదనే నేపంతో ఆమెను హత్యచేయాలని పన్నాగంపన్నాడు. మంగళవారం తెల్లవారుజామున నిద్రలో ఉన్న ఆమె ముఖంపై దిండుతో అదిమి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. నిద్రలోనుంచి తేరుకున్న ఆమె నరసయ్యను నెట్టివేసి తప్పించుకుని బయటకు వచ్చి కేకలు వేసింది. చుట్టుపక్కల వారు గుమికూడడంతో ఇంటి గోడ దూకి అతను పరారయ్యాడు. పద్మావతి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రమేష్‌కుమార్ తెలిపారు.

ప్రమాదాల నివారణకు కృషి చేయాలి

- ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సరిరాం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎం సరిరాం

ఖమ్మం ఖానాపురంహవేలి, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఉత్తమ డ్రైవింగ్ మెలకువలతో ప్రమాదాలు నివారించవచ్చునని ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సరిరాం అన్నారు. మంగళవారం నగరంలోని నూతన బస్టాండ్‌లో డ్రైవర్లకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆర్ఎం సరిరాం, ఖమ్మం పట్టణ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు, సీఐ బి. సత్యనారాయణ హాజరై మాట్లాడారు. ప్రమాదాల సంఖ్యను తగ్గించటానికి, ప్రయాణికుల మన్ననలు పొందడం కోసం ప్రమాదాలకు కారణమైన డ్రైవర్లకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సాంకేతిక అంశాలను అలవర్చుకొని డ్రైవింగ్‌లో మెలకువలు తెలుసుకొని ప్రయాణికులను సురక్షితమైన ప్రయాణాన్ని అందించటానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. అనంతరం డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం మల్లయ్య, డిపో మేనేజర్ దినేష్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు

కల్లూరు, జూలై22 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలంలోని తూర్పు లోకవరం గ్రామంలో ఓ బాలిక అదృశ్యమైన ఘటనపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని తూర్పులోకవరం గ్రామంలో సోమవారం తల్లిదండ్రులు పొలానికి వెళ్లిన సమయంలో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా సదరు బాలిక ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. తల్లిదండ్రులు ఇంటికి వచ్చిన తర్వాత కుమార్తె కనబడకపోవడంతో చుట్టు పక్కల గ్రామాలలో, బంధువుల ఇళ్ల దగ్గర వెతిన ఆచూకీ లభించలేదు. కుటుంబసభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ హరిత బాలిక అదృశ్యమైనట్లుగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

- రూ.46,500 నగదు స్వాధీనం

పినపాక, 22 జూలై (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏడూళ్లబయ్యారం గ్రామంలో పోలీసులు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం ఏడూళ్లబయ్యారం పోలీసులకు అందిన సమాచారంతో పేకాటస్థావరంపై దాడులు నిర్వహించి, పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. ఈ దాడుల్లో రూ. 46,500 నగదు, 4 ద్విచక్ర వాహనాలు, 8 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వారిపైన కేసు నమోదు చేసి, రిమాండ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఏపీ హోంమంత్రి పీఏగా చలామణి అవుతున్న ఖమ్మం వాసి ?

ఖమ్మం క్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఏపీ హోంశాఖ మంత్రి అనిత పీఏ అని చలామణి అవుతున్న ఖమ్మానికి చెందిన ఓ వ్యక్తిని విజయనగరం పోలీసులు మంగళవారం సాయంత్రం అరెస్ట్ చేసినట్లు తెలుస్తోంది. ఖమ్మానికి చెందిన అల్లూరి అరవింద్ అనే వ్యక్తి హోం మంత్రి పీఏనని కొంతమంది ప్రభుత్వ సిబ్బందితో పరిచయం చేసుకుంటూ, తనను కలవాలని కొందరిని బెదిరించాడు. ఈ విషయం అక్కడి పోలీసుల దృష్టికి వెళ్లింది. దీంతో అరవింద్‌ను విజయనగరం వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్‌చేసి కేసు నమోదు చేసినట్లు విజయనగరం ఎస్పీ వకుల్ జిందాల్ ఒక ప్రకటనలో తెలిపారు. కాగా అల్లూరి అరవింద్ పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండండి

బీజేపీ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

మణుగూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు నాయకులు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలో మంగళవారం పట్టణ అధ్యక్షుడు భిక్షపతి అధ్యక్షతన జరిగిన మండల పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ కేంద్ర సంక్షేమ పథకాలను తెలియజేయాలన్నారు. పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకులు జంపన సీతారామరాజు, పినపాక నియోజకవర్గ కన్వీనర్ పున్నం భిక్షపతి, నాయకులు బాలు నాయక్, దాట్ల రామకృష్ణం రాజు, ఈసాల వెంకటేశ్వర్లు, లింగంపల్లి రమేష్, కుంజా రామకృష్ణ, మీసాల దుర్గారావు, ముత్యాల వెంకటేశ్వర్లు, వీరమధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన లారీ

ఖమ్మంక్రైం, జూలై22(ఆంధ్రజ్యోతి): కారును తప్పించబోయి ఓ లారీ డివైడర్ వైపు దూసుకెళ్లిన సంఘటన మంగళవారంరాత్రి ఖమ్మం నగర పరిధిలో జరిగింది. నగర శివారులోని గోపాలపురం బొద్రాయి సెంటర్ వద్ద ఓ కారు అడ్డుగా రావడంతో లారీడ్రైవర్ దానిని తప్పించబోయి సమీపంలోని డివైడర్‌ను ఎక్కించాడు. దీంతో డివైడర్‌కి ఉన్న విద్యుత్‌స్తంభం విరిగి పడిపోయింది. విరిగిన స్తంభం అటుగా వెళుతున్న ఆటోపై పడబోయింది. ఖానాపురంహవేలి పోలీసులు సంఘటనా స్థలం వద్దకు చేరుకొని వాహనాలను తొలగించారు.



26న అథ్లెటిక్స్ ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్, జూలై 22(ఆంధ్రజ్యోతి): జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 26న నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో అండర్- 14, 16, 18, 20 సీనియర్ మెన్, ఉమెన్ విభాగాల్లో అథ్లెటిక్స్ జట్ల ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మందుల వెంకటేశ్వర్లు, ఎండీ షఫీక్‌అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపికచేసి ఆగస్టు 3న హన్మకొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ పత్రంతో ఆదివారం ఉదయం 9 గంటలకల్లా స్టేడియానికి చేరుకోవాలని కోరారు.

ప్రజలపక్షాన నిలిచిన దాశరథి

- ఈస్థటిక్స్ ఆధ్వర్యంలో నీరాజనోత్సవం
- ఘనంగా ప్రజాకవి జయంతి




దాశరథి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఆనందాచారి, రవిమారుత్, తదితరులు, టాంక్ బండ్ వద్ద విగ్రహానికి నివాళులర్పిస్తున్న మువ్వా, బాగం తదితరులు

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై22 (ఆంధ్రజ్యోతి): ప్రజలపక్షాన నిలిచిన ప్రజాకవి దాశరథిఅని పలువురు వక్తలు కొనియాడారు. ఆయన శతజయంతి సందర్భంగా తెలంగాణ సాహిత్య అకాడెమీ సౌజన్యంతోమంగళవారం ఖమ్మం ఈస్థటిక్స్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ హాల్లో నీరాజనోత్సవం నిర్వహించారు. కవి, విద్యావేత్త రవిమారుత్ అధ్యక్షత వహించిన ప్రారంభ సభలో తెలంగాణ సాహితి రాష్ట్రఅధ్యక్షుడు ఆనందాచారి మాట్లాడారు. నైజాం నవాబు ప్రజా పీడనకు వ్యతిరేకంగా కలం పట్టి గళం ఎత్తి పోరాడాడని గుర్తు చేశారు. దాశరథి స్ఫూర్తితో నేటితరం ప్రపంచవ్యాప్తంగా అమెరికా,ఇజ్రాయెల్ గాజాలో చేస్తున్న నరమేధానికి వ్యతిరేకంగా నిలబడాలని పిలుపిచ్చారు. డాక్టర్.రమేష్ మాట్లాడుతూ జైలు గోడలమీద కూడా నైజాంకు వ్యతిరేకంగా బొగ్గుతో కవిత్వం రాసిన దాశరథి ప్రజల కోసం పోరాడే సాహిత్యకారులకు ఆదర్శ ప్రాయుడన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యుడు ప్రసేన్ అధ్యక్షత వహించిన రెండోసభలో పోతగాని సత్యనారాయణ, యనగందుల దేవయ్య, వంశీకృష్ణ, తోటసుభాషిణి, కన్నెగంటి వెంకటయ్య సాహిత్య ప్రక్రియలో దాశరథి సేవలను వివరించారు.ఈ సభలో ప్రముఖ విద్యావేత్తలు ఐవి రమణారావు,కె ఎస్ రామారావు, వాసిరెడ్డి శ్రీనివాస్ దాశరథి సాహిత్య ప్రస్థానాన్ని వివరించారు. ప్రముఖ కవి సీతారాం పిల్లలకు క్విజ్‌పోటీ నిర్వహించి బహుమతులు అందించారు.

దాశరథి విగ్రహానికి నివాళి

దాశరథి కృష్ణమాచార్యులు జయంతి సందర్భంగా లకారం ట్యాంక్ బండ్‌లో ఉన్న దాశరథి విగ్రహం వద్ద గుర్రం జాషువా సాహిత్య వేదిక అధ్యక్షుడు, ప్రముఖ కవి మువ్వా శ్రీనివాసరావు, సీపీఐజాతీయ సమితి సభ్యుడు బాగం హేమవంతరావు, ప్రముఖ కవి రచయిత వ్యక్తిత్వ వికాస నిపుణుడు ఆట్లూరి. వెంకటరమణ నివాళుల ర్పించారు. రచనలతో సమాజంలోని చీకట్లను అడుగడుగున ప్రశ్నించి నిలదీసి జాతిని చైతన్య పరిచారని కొనియాడారు. ఈకార్యక్రమంలో జాషువా సాహిత్యవేదిక ప్రధాన కార్యదర్శి పగిడిపల్లి వెంకటేశ్వర్లు, కవులు కన్నెగంటి. వెంకటయ్య, కోంద్రు బ్రహ్మం, నయాం పాషా, గద్దపాటి శ్రీనివాస్,పేరెల్లి.శ్రీను,శ్రీనివాస యాదవ్,రాజు నివాళులు అర్పించారు.

పోస్టర్ ఆవిష్కరణ

ఎస్‌బీజీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఆ చల్లని సముద్రగర్భం దాశరథి గేయ వాల్ పోస్టర్లను ప్రిన్సిపాల్ మొహ్మద్ జాకిరుల్లా ఆవిష్కరించారు. గతనెల 20,21తేదీల్లో శతజయంతి సాహితీమూర్తులు దాశరథి, ఆరుద్రల రెండురోజుల జాతీయ సదస్సు నిర్వహించామని చెప్పారు. కార్యక్రమంలో తెలుగు విభాగాధిపతి పి.రవికుమార్, అధ్యాపకులు జె.అనురాధ, కోటమ్మ, కార్తీక్, ఎం.వి.రమణ, కిరణ్ పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు తెలంగాణ సాహిత్య నిధి-దాశరథి అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ, కవితా పఠన పోటీలు నిర్వహించారు.

ఖాళీ స్థలాల పరిశుభ్రతపై కఠినంగా వ్యవహరించాలి

- స్పందించకుంటే నోటీసులు జారీ చేయాలి
- మేయర్ పునుకొల్లు నీరజ
- జవాన్లతో సమావేశం

ఖమ్మంకార్పొరేషన్, జూలై22 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యానికి హానికరంగా మారిన ఖాళీ స్థలాల పరిశుభ్రంపై పారిశుధ్య విభాగం అధికారులు కఠినంగా వ్యవహరించాలని మేయర్ పునుకొల్లు నీరజ ఆదేశించారు. మంగళవారం కేఎంసీలో పారిశుధ్య జవాన్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, అధికారులతో మేయర్ సమీక్ష నిర్వహించారు. చాలామంది స్థలాలు కొనుగోలు చేసి వాటిలో నిర్మాణాలు చేపట్టకుండా ఖాళీగా ఉంచటంతో వర్షాకాలం పిచ్చి మొక్కలు, నీరు చేరి దోమల, విషసర్పాలు పెరుగుతున్నాయన్నారు. సీజన్ వ్యాధులకు కారణమవుతున్నాయన్నారు. ప్రతీడివిజన్‌లోను జవాన్లు ఖచ్చితంగా ప్రతీ ఖాళీస్థలం యజమాని వివరాలు తెలుసుకొని శుభ్రం చేయించాలని ఆదేశించారు. లేకుంటే ప్రభుత్వ జీవోల మేరకు స్వాధీనం చేసుకుంటున్నట్లు నోటీసు బోర్డులు పెట్టాలని ఆదేశించారు. ఖాళీస్థలాల యజమానులు కూడా పారిశుధ్య విభాగం సిబ్బందికి సహకరించాలని కోరారు.స్వచ్ఛందంగా ఎవ్వరి ఖాళీ స్థలాలను వారే పరిశుభ్రం చేయాలని, లేకుంటే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అవసరమైతే ప్రజారోగ్య చట్టం మేరకు కేసులు నమోదుజరుగుతాయన్నారు. డిప్యూటీ మేయర్ పాతిమా జోహరా, అసిస్టెంట్ కమిషనర్ అనిల్, పారిశుధ్య పర్యవేక్షకులు సాంబయ్య, కార్పొరేటర్లు రాపర్తి శరత్‌కుమార్, లకావత్ సైదులునాయక్, దుద్దుకూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మార్కెట్ స్థలాల ఆక్రమణపై పరిశీలన

30, 31 డివిజన్లలో పర్యటించిన మేయర్, కమిషనర్, ఏఎంసీ చైర్మన్



విచారణ జరుపుతున్న మేయర్, కమిషనర్

ఖమ్మంకార్పొరేషన్,జూలై 22(ఆంధ్రజ్యోతి): ఖమ్మం వ్యవసాయ మార్కెట్ స్థలాలు ఆక్రమణకు గురి కావటంతో మార్కెట్ కమిటీ ఫిర్యాదు మేరకు మంగళవారం మేయర్ పునుకొల్లు నీరజ, ఏఎంసీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, కమిషనర్ అభిషేక్ అగస్త్య క్షేత్ర స్థాయిలో పరిశీలించి విచారణ చేపట్టారు. 30, 31వ డివిజన్లలో పర్యటించారు. పట్టణ ప్రణాళిక అధికారులు పూర్తి స్థాయిలో నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు.

దళారుల మాటలు నమ్మొద్దు

జిల్లా వైద్యాధికారి కళావతిబాయి

ఖమ్మంకలెక్టరేట్,జూలై22(ఆంధ్రజ్యోతి): కొంతమంది జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో,ఆసుపత్రుల్లో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ డేటా ఎంట్రీ ఆపరేటర్ (డీఈవో) పోస్టులను ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేస్తున్నారని అలాంటి దళారుల మాటలు నమ్మొద్దని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కళావతీబాయి విన్నవించారు. పోస్టులను నింపాల్సి వస్తే, ప్రభుత్వ ఆదేశానుసారం కలెక్టర్ అనుమతితో పత్రికల్లో నోటిఫికేషన్ ఇచ్చి నియామకాలు చేపట్టనున్నట్లు ఆమె చెప్పారు. అంతేకాని కొంతమంది వ్యక్తులను, సంస్థలను నమ్మి ఆర్థికంగా నష్టపోవద్దని సూచించారు.

దివ్యాంగులకు రూ.6వేల పింఛన్ ఇవ్వాలి

తిరుమలాయపాలెం, జూలై22 (ఆంధ్రజ్యోతి): వృద్ధులు వికలాంగులకు, వితంతువులకు పింఛన్లు పెంచాలని ఎంఆర్‌పీఎస్ జిల్లానాయకులు చింతిరాల నాగభూషణం డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని బీరోలు,బచ్చోడు,దమ్మాయిగూడెం, తిరుమలాయపాలెం గ్రామాల్లోసమావేశం నిర్వహించారు. ఈనెల24న ఖమ్మం లో జరిగే వికలాంగుల చేయూత పెన్షన్‌దారుల సింహగర్జన జయప్రదం చేయాన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు గోవింద సురేష్, భారతి, మల్లయ్య, సైదాబీ, బాలయ్య పాల్గొన్నారు.

వంటసామగ్రి అందజేత



వంట సామగ్రిని పంపిణీ చేస్తున్న ఎంఈవో చలపతిరావు

నేలకొండపల్లి, జూలై22(ఆంధ్రజ్యోతి): మంగళవారం మండల వనరుల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో అన్ని పాఠశాలలకు మధ్యాహ్న భోజన కార్మికులకు వంటకు అవసరమైన అన్ని వంట పాత్రలను మండల విద్యాధికారి బాలిన చలపతిరావు అందజేశారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన వర్కర్స్ వంట చేయటానికి పాత్రలు సరిగాలేక పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ వీటిని అందజేసిందన్నారు. అనంతరం ఎంఈవో చలపతిరావు మాట్లాడుతూ వంట చేసే పాత్రలను జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. నిత్యం శుభ్రం చేయాలన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంకండి

- ఇల్లెందు ఎమ్మెల్యే కనకయ్య

కామేపల్లి, జూలై 22(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలిపించేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మంగళవారం ఊట్కూర్‌లో రూ.36లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేశారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను గతప్రభుత్వం అప్పుల పాలు చేసిందని అన్నారు. ఆర్థిక పరిస్థితి లేకున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సీఎంరిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ డైరెక్టర్ రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, మేకల మల్లిబాబు, పీఏసీఎస్ చైర్మన్లు పుచ్చకాయల వీరభద్రం, దనియాకుల హన్మంతరావు, ఏపూరి మహేందర్ నల్లమోతు లక్ష్మయ్య, జగన్నాథరెడ్డి, డీఎస్, ఆరెం రవి, సరిరాం, లక్ష్మణ్, చల్ల మల్లయ్య, బావ్ సింగ్, అనురాధ, సీపీఐ నాయకురాలు ఏపూరి లతాదేవి, లావుడ్య వినోద్, ప్రేమ్,నర్సింహనాయక్, మేకపోతుల మహేష్ తహశీల్దార్ సుధాకర్, ఎంపీడీఓ రవీందర్ పాల్గొన్నారు.



ఊట్కూర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

ఆలయ భూముల కౌలు వేలం కొలిక్కి వచ్చేనా?

- నేలకొండపల్లిలో నేడు నాలుగోసారి ప్రక్రియ
- భూముల కబ్జాను తేల్చాలని వేలాన్ని బహిష్కరిస్తున్న రైతులు



నేలకొండపల్లిలోని శ్రీరాజగోపాలస్వామి దేవాలయం

నేలకొండపల్లి, జూలై22 (ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లిలోని శ్రీరాజగోపాలస్వామి వారి భూముల కౌలు వేలాన్ని బుధవారం ఉదయం నిర్వహించనున్నారు. ఆలయ ఆవరణలో, దేవాదాయశాఖ అధికారుల సమక్షంలో వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ శ్రీకాంత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భూముల కౌలు గురించి మండలంలో కరపత్రాల ద్వారా ప్రచారం నిర్వహించారు. నేలకొండపల్లిలో 13.25ఎకరాలను మూడేళ్లకు 2025-28 వరకు కౌలుకు ఇవ్వనున్నారు.కౌలుబహిరంగ వేలంలో పాల్గొనదలచిన వారు డిపాజిట్‌గా రూ.50వేలు చెల్లించాలి. దేవస్థానానికి బకాయి ఉన్నవారు కౌలు వేలంలో పాల్గొనటానికి అనర్హులు. అనివార్య కారణాల వల్ల వేలాన్ని రద్దు చేసే అధికారం దేవాలయ అధికారులకు ఉంటుంది.

వేలం నిర్వహించటం నాలుగోసారి

గతంలో ఎన్నడూ లేని విధంగా ఓ దేవాలయానికి సంబంధించిన ఒకే సర్వే నెంబర్లలోని భూములకు బహిరంగ వేలం నిర్వహించటం ఇది నాలుగవ సారి.. ఆలయ భూములు కబ్జాకు గురయ్యాయని ఆరోపిస్తూ మూడుసార్లుగా రైతులు కౌలువేలాన్ని బహిష్కరిస్తూ వస్తున్నారు. దేవాలయ భూములను సమగ్రంగా సర్వేచేయించిన అనంతరమే భూముల వేలం నిర్వహించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కానీ అధికారులు సంవత్సరాలుగా భూములను సర్వే చేయించకుండా దాటవేస్తూ వస్తున్నారు.గతంలో సర్వే చేయించినప్పటికీ, సర్వే నివేదికను తీసుకోక పోవటంతో అధికారులు భూముల హద్దులను గుర్తించలేక పోయారు. మూడోసారి కౌలు వేలం సమయంలో పోలీసులకు సమాచారం అందించినప్పటికీ, పోలీసులు దేవాలయంలో కౌలు నిర్వహించే ప్రాంతానికి వచ్చే సమయానికి అధికారులు వేలాన్ని వాయిదా వేశారు. ఈ సారైనా వేలం సజావుగా సాగుతుందో లేదో చూడాలి..

రేపు వైరాలో టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా మహాసభ

ఖమ్మంచర్చికాంపౌండ్, జూలై22(ఆంధ్రజ్యోతి):తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ టీయూడబ్ల్యూజే(ఐజేయూ)జిల్లా మహాసభ గురువారం వైరాలో జరుగుతుందని సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వనం వెంకటేశ్వర్లు, ఏనుగు వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రులు భట్టి, తుమ్మల, పొంగులేటి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్‌దత్, టీయూడబ్ల్యూజే(ఐజేయూ)రాష్ట్రఅధ్యక్షుడు విరాహత్‌అలీ, ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ హాజరవుతారని తెలిపారు. వైరాలోని శబరి గార్డెన్‌లో జరిగే ఈజిల్లా మహాసభకు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆ ప్రకటనలో పిలుపునిచ్చారు.

జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశం

ఖమ్మం కలెక్టరేట్, జూలై 22(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచిమంగళవారం మంత్రులు నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అనుదీప్ జిల్లా అధికారులతో సమావేశమయ్యారు.రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో ఫుడ్ పాయిజన్ జరగకుండా అప్రమత్తంగా ఉండాలని, జిల్లాలో రెసిడెన్షియల్ విద్యా సంస్థలను మండల ప్రత్యేక అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేసి భోజనం నాణ్యతను తనిఖీ చేయాలన్నారు. భూభారతి పెండింగ్ దరఖాస్తులలో త్వరగా పరిష్కరించే వాటికి ప్రాధాన్యత కల్పిస్తూ చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై తహసీల్దార్లతో ప్రత్యేకంగా వీసీ నిర్వహించాలని కలెక్టర్.. అదనపుకలెక్టర్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పౌర సరఫరాల శాఖలో గన్నీ బ్యాగుల రికన్సిలేషన్ పక్కాగా జరిగేలాచూడాలన్నారు. రేషన్‌కార్డుల పంపిణీ కోసం మంత్రులు, స్థానిక నాయకుల సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని సూచించారు. పాలేరు, వైరా, సత్తుపల్లికి మంజూరైన ఐటీఐ ఏటీసీ కేంద్రాల నిర్మాణానికి అనువైన స్థలాల ఎంపిక పూర్తి చేయాలని ఆదేశించారు.

కలెక్టర్‌ను కలిసిన మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్



కలెక్టర్ అనుదీప్‌ను కలిసిన శంకర్

ఖమ్మంకలెక్టరేట్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శంకర్ మంగళవారం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని మర్యాదపూర్వకంగా కలిశారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన కలెక్టర్‌ను మంగళవారం కలిశారు. పుష్పగుచ్ఛాలిచ్చారు. ఈసందర్భంగా కలెక్టర్ ఆయనను అభినందించారు. కళాశాలలో మెరుగైన ఫలితాలు సాధించాలని విద్యార్థులకు మంచి సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఆయన వెంట జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నరేందర్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ బి.కిరణ్‌కుమార్ ఉన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలి

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కళావతి బాయి

ఖమ్మంకలెక్టరేట్, జూలై22(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించడంలో పీహెచ్‌సీ వైద్యులు అంకితభావంతో పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.కళావతీబాయి అన్నారు. మంగళవారం ఆమె చాంబర్‌లో సీజనల్ వ్యాధులు, కీటక జనీత వ్యాధులు, ఇమ్యూనైజేషన్, మాతా శిశు సంరక్షణ సేవలు, పాముకాటు, కుక్కకాటు తదితర కార్యక్రమాలపై ప్రోగ్రాం అధికారులతో ఆమె సమీక్షించారు. పీహెచ్‌సీలలో డాక్టర్లు, పారామెడికల్ సిబ్బందిఅందుబాటులో ఉండాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా వుండాలని, డెంగి వ్యాధిని లైన్ డిపార్ట్మెంట్ వాళ్లతో కలిసి కట్టడి చేద్దామని, మలేరియ, ఫైలేరియ, మెదడు వాపు, ప్రధానంగా డెంగి వ్యాధి పట్ల అప్రమత్తంగా వుండి, నివారణ చర్యలతో పాటుగా పాజిటివ్ కేసులకు వెంటనే చికిత్స అందించి ప్రజల ప్రాణాలను కాపాడాలని ఆమె కోరారు.

కేంద్ర వ్యవసాయ విధానాలకు తలొగ్గిన రాష్ట్ర ప్రభుత్వం

- ఏఐయూకేఎస్ రాష్ట్ర నాయకుడు



మాట్లాడుతున్న అచ్చయ్య

ఖమ్మంసంక్షేమ విభాగం,జూలై 22(ఆంధ్రజ్యోతి): అమెరికా వాణిజ్య ఒప్పందం మేరకు కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ వ్యతిరేక విధానాలను అమలు చేస్తుంటే వాటికి రాష్ట్ర ప్రభుత్వం తలొగ్గిందని అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు గుర్రం అచ్చయ్య డిమాండ్ ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎరువుల కృత్రిమ సృష్టి కారణంగానే కొరత ఏర్పడిందన్నారు. దీంతో రైతులు బ్లాక్ మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. తెలంగాణ వ్యవసాయ రంగానికి కావాల్సిన ఎరువులను కేంద్ర ప్రభుత్వంపై పోరాడి తీసుకరావాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఉందన్నారు. ప్రమాదకరమైన పురుగుల మందులు వినియోగంపై కఠినంగా వ్యవహరించి అటువంటి కంపెనీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కౌలురైతులకు భరోసా పథకం అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వం స్వామినాథన్ కమిషన్ సిఫారసుల అమలు చేయాలని కోరారు. సంఘంజిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మలీదు నాగేశ్వరరావు, కోలేటి నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతులకు బలవంతంగా నానో యూరియాను అమ్మకాలు చేస్తున్నారని ఈ చర్యలపై పోరాటాలు చేస్తామన్నారు. ఆవుల వెంకటేశ్వర్లు, పాశం అప్పారావు, కుర్ర వెంకన్న, ఉగులోత్ తేజా, కమ్మకోమటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా కార్యదర్శికి సన్మానం

ఖమ్మంరూరల్, జూలై22 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన ఏదులాపురం గ్రామానికి చెందిన దండి సురేష్‌ను పలువురు నాయకులు, ఉద్యమకారులు మంగళవారం ఆయన ఇంట్లో సన్మానించారు ఈ సందర్భంగా దండి సురేష్ మాట్లాడుతు తనపై అభిమానానికి ధన్యుడినని తెలిపారు. నమ్మకంతో బాధ్యత అప్పగించారని, ఇది మరింత బాధ్యతను పెంచిందన్నారు. ప్రజాసమస్యలపై పోరాటం చేస్తూ సీపీఐని బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్రప్రధాన కార్యదర్శి బత్తుల సోమయ్య, రామారావు, బిక్షం, పాపయ్య, శుక్రుద్దీన్ పాల్గొన్నారు.



సురేష్‌ను సన్మానిస్తున్న నాయకులు

రేపు వైరాలో టీయూడబ్ల్యూజే(ఐజేయూ)జిల్లా మహాసభ

ఖమ్మంచర్చికాంపౌండ్, జూలై22(ఆంధ్రజ్యోతి):తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ టీయూడబ్ల్యూజే(ఐజేయూ)జిల్లా మహాసభ గురువారం వైరాలో జరుగుతుందని సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వనం వెంకటేశ్వర్లు, ఏనుగు వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్‌దత్, జిల్లా పౌరసంబంధాలశాఖ అధికారి ఎండీ గౌస్‌అలీ, టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్‌అలీ, ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ హాజరవుతారని తెలిపారు. వైరాలోని శబరి గార్డెన్‌లో జరిగే మహాసభకు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆ ప్రకటనలో పిలుపునిచ్చారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



సిద్దారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి

సత్తుపల్లి, జూలై22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అర్హులైన ప్రజలందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలను అమలు చేస్తుందని సత్తుపల్లి ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలో రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈనెల 25నుంచి నూతనంగా రేషన్ కార్డులను అందించనున్న నేపథ్యంలో వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఉన్న చోట వెంటనే పరిష్కరించడంతో అసలైన లబ్దిదారులకు మాత్రమే తెల్ల రేషన్ కార్డులను మంజూరు చేయాలని సూచించారు. భూ భారతి చట్టం అమలులో భాగంగా గ్రామసభలు నిర్వహించి ప్రజల నుంచి తీసుకున్న దరఖాస్తుల వివరాలతో పాటు పెండింగ్‌లోని రికార్డులు, సమస్యల పరిష్కారం ఏ దశలో ఉన్నాయోనని అడిగి తెలుసుకున్నారు. కల్లూరు ఆర్డీవో ఎల్.రాజేందర్‌గౌడ్‌తో పాటు ఐదు మండలాల తహసీల్దార్లు, డీటీలు, గిర్ధావర్లు పాల్గొన్నారు.

సిద్దారంలో 80మంది కాంగ్రెస్‌లో చేరిక

మండలంలోని సిద్దారంలోని ఇతర పార్టీలకు చెందిన 80మంది కాంగ్రెస్‌లో చేరగా ఎమ్మెల్యే డా.రాగమయి వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఏర్పాటు ఇలా.. వ్యాయామం ఎలా?

» నల్లరేగడి నేల, పిచ్చిచెట్లు, వర్షపునీరు నిలిచే చోట జిమ్మా..

» ఇరుకుగా ఉన్న రిజర్వాయర్ ఆనకట్టపై ఏర్పాటు సరైనదేనా?



వర్షం కురవడంతో జిమ్ పరికరాలున్న ప్రదేశంలో నీరు చేరిన దృశ్యం



రిజర్వాయర్ ఆనకట్టపై ఇరుకు ప్రదేశంలో ఏర్పాటు చేసిన జిమ్ పరికరాలు

వైరా, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ పరిధిలో రిజర్వాయర్ వద్ద జిమ్ ఏర్పాటు చేసిన తీరుపై స్థానికులు తీవ్రంగా నిరసిస్తున్నారు. స్థానికుల నుంచి కనీస సలహాలు, సంప్రదింపులు లేకుండా తమ ఇష్టానుసారం జిమ్ పరికరాలను ఏర్పాటుచేసి ప్రారంభానికి సిద్ధం చేశారు. ఈ జిమ్ ఏర్పాటుచేసిన అధికారుల తీరుపై స్థానికులు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. వైరా రిజర్వాయర్ ఆనకట్టపై ఇరుకుగ ఉన్న దారిలో కొన్ని జిమ్ పరికరాలను, అలాగే ఆనకట్ట ముందు భాగంలో పిచ్చిచెట్లు, గుంతలతో నిండి ఉన్న నల్లరేగడి భూమిలో మరికొన్ని జిమ్ పరికరాలను ఇటీవల ఏర్పాటు చేశారు. ప్రజాప్రతినిధుల చేతులమీదగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే గత మూడురోజులుగా కురుస్తున్న వర్షాలతో ఆనకట్ట ముందుభాగంలో నల్లరేగడి భూమిలో ఏర్పాటుచేసిన జిమ్ పరికరాల మధ్య మొత్తం వర్షపునీరు చేరింది. వారంరోజుల కిందటి వరకు అడవిని తలపిస్తున్న ఈ స్థలాన్ని ఎక్స్‌కవేటర్‌తో అరకొరగా శుభ్రం చేశారు. ఈ స్థలంలో అలాగే చుట్టూపక్కల కంపచెట్లు, పిచ్చిమొక్కలు అలాగే ఉన్నాయి. అంతేకాకుండా ఈ స్థలం మొత్తం గుంతలమయంగా ఉంది. వర్షం కారణంగా ఆ గుంతల్లో నీరు చేరింది. కనీసం అందులో అడుగు వేసే పరిస్థితి కూడా లేకుండాపోయింది. ఈ భూమిని చదును చేసి ఫ్లోరింగ్ చేసిన తర్వాత జిమ్ పరికరాలను ఏర్పాటుచేయాల్సిన అధికారులు నల్లరేగడి భూమిలో వాటిని అమర్చారు. అధికారుల తీరు పట్ల స్థానికులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇకపోతే రిజర్వాయర్ ప్రారంభంలో ఇరుకుగా ఉన్న ఆనకట్టపై జిమ్ పరికరాలను ఏర్పాటుచేసి చేతులు దులుపుకున్నారు. జిమ్ పరికరాలను రిజర్వాయర్ గుట్టల వద్ద ఖాళీ స్థలంలో ఏర్పాటుచేయాల్సి ఉండగా అందుకు భిన్నంగా అడ్డగోలుగా పరికరాలను అమర్చారు. రిజర్వాయర్‌కు ఉదయం, సాయంత్రం వేళల్లో మరీ ముఖ్యంగా సెలవు దినాల్లో మహిళలు పిల్లలతో ఆటవిడుపుగా రిజర్వాయర్‌ను సందర్శించి సేదతీరుతుంటారు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో వందలాది మంది రిజర్వాయర్ ఆనకట్టపై వాకింగ్ చేస్తుంటారు. వీరందరికి అనుకూలంగా రిజర్వాయర్ గుట్టల వద్ద జిమ్ ఏర్పాటుచేయాల్సి ఉండగా ఏమాత్రం అనుకూలంగా లేని చోట జిమ్ పరికరాలను ఏర్పాటుచేశారు. వాటిని ప్రారంభించటానికి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికైనా జరిగిన తప్పిదాన్ని గుర్తించి ప్రజలకు సౌకర్యంగా ఉండే చోట జిమ్ పరికరాలను ఏర్పాటుచేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



అర్బన్ పార్క్‌లో క్లేవాల్స్ చల్లుతున్న సబ్‌జైల్ సిబ్బంది

పర్యావరణాన్ని కాపాడుదాం

సత్తుపల్లిరూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ తరాలకు ప్రాణవాయువు చెట్ల ద్వారానే అందుతుందని, అడవులను సృష్టించి పర్యావరణాన్ని కాపాడుదామని సత్తుపల్లి సబ్ జైల్ సూపరింటెండెంట్ ఉబ్బల కుటుంబరాజు అన్నారు. జైళ్ల డీజీ సౌమ్యమిశ్ర ఆదేశానుసారం మంగళవారం సత్తుపల్లిలోని నీలాద్రి ఫారెస్ట్ అర్బన్ పార్క్‌లో క్లేవాల్స్ సీడ్స్‌ను చల్లారు. సబ్‌జైల్‌లోని శిక్ష అనుభవిస్తున్న వ్యక్తులు (ఖైదీలు) చేత వేప, చింత, సీతాఫలం, మద్ది విత్తనాలను సుమారు 2వేల క్లేవాల్స్‌లో ఉంచామని, వీటిని చల్లి అడవులను సృష్టించవచ్చునని చెప్పారు. అడవులను కాపాడడంలో ముఖ్యంగా యువత బాధ్యత తీసుకుని భవిష్యత్ తరాలకు పచ్చదనాన్ని పంచాలని ఆకాంక్షించారు. ఏడీజే శ్రీనివాస్, హెడ్ వార్డర్ శ్రీనివాస్, వార్డర్స్ కే.శ్రీను, సాంబశివరావు, శివకృష్ణ, హోంగార్డ్స్ పాల్గొన్నారు.

కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్‌కు నివాళి



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

పెనుబల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సీపీఎం పెనుబల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో వీఎంబంజర్ రింగ్ సెంటర్లో కేరళ మాజీముఖ్యమంత్రి వీఎస్.అచ్యుతానందన్ సంస్మరణ సభను మంగళవారం నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు అధ్యక్షతన జరిగిన సంస్మరణ సభలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు చలమాల విఠల్‌రావు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం నాయకులు చిమటా విశ్వనాథం, చలమాల నర్సింహారావు, మేకల బాజీ, మిద్దే స్వామి, ఇతర పార్టీలకు చెందిన భూక్యా ప్రసాద్, మల్లెల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అన్నిస్థానాల్లో పోటీకి బీజేపీ సిద్ధం: నంబూరి



విలేకరులతో మాట్లాడుతున్న నంబూరి

సత్తుపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్నిస్థానాల్లో పోటీచేసేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని బీజేపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు తెలిపారు. మంగళవారం స్థానిక ఎన్టీఆర్ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లాలోని 288ఎంపీటీసీ, 20జడ్పీటీసీ స్థానాల్లో పోటీచేసి బీజేపీ జెండాను జిల్లా ఖిల్లాపై ఎగురవేస్తామని ప్రతిజ్ఞ చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య లోపాయికార ఒప్పందాలు జరిగాయని, ఆ చీకటి ఒప్పందాలను తిప్పికొట్టేందుకు ప్రధాని మోదీ ప్రతిఇంటికి అందిస్తున్న పథకాలే తమకు శ్రీరామరక్ష అని అన్నారు. ఇప్పుడు ప్రజలంతా బీజేపీ వైపు చూస్తున్నారని, ఏ ఎన్నికలు వచ్చినా తమను గెలిపించేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని చెప్పారు. నాయకులు బాణోత్ విజయ్, వీరంరాజు, సాలి శివ, నాయుడు రాఘవరావు, జొన్నలగడ్డ నరేష్, మట్టా ప్రసాద్, రహ్మతుల్లా, శ్రీనివాస్, రాంబాబు, నాగ సురేందర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, శివ, ఆచంట సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మహిళా సాధికారిత వేడుకలు

» సత్తుపల్లి ఆర్టీసీ డీఎం రాజ్యలక్ష్మి



విద్యార్థినులకు పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

సత్తుపల్లిరూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రమంతటా మహిళలు 200కోట్ల ఉచిత ప్రయాణాలు చేసిన సందర్భంగా మహిళా సాధికారతపై ప్రజల్లో మరింత అవగాహన, ప్రజా భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు నేడు ఆర్టీసీ డిపోలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డీఎం యూ.రాజ్యలక్ష్మీ తెలిపారు. ఈ సందర్భంగా జేవీఆర్ కళాశాల, బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినీలకు మంగళవారం మహిళ సాధికారతపై వ్యాసరచన పోటీలు నిర్వహించగా నేడు విజేతలకు బహుమతులను అందజేయనున్నారు. కాగా ఈ కార్యక్రమానికి సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ ముఖ్య అతిథులుగా హాజరవ్వనున్నారు. ఇందులో భాగంగా ప్రతి రోజూ ప్రయాణాలు చేస్తున్న ఆయా రంగాల మహిళామణులను ఘనంగా సన్మానించి ప్రశంసాపత్రాలు అందించనున్నామని, డిపో ఉద్యోగులు, సిబ్బంది, మహిళలతో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని డీఎం కోరారు.

అంబారుపేట ఘటన విషయంలో పోలీసులపై భట్టి సీరియస్



భట్టికి ఫిర్యాదు చేస్తున్న బాధితులు

మధిర, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మధిర మునిసిపాలిటీ పరిధిలోని అంబారుపేట గ్రామంలో ఇటీవల ఓ కుటుంబం వారు మరో కుటుంబం వారిపై పట్టపగలు కర్రలు, కత్తులతో దాడి చేసిన విషయంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పోలీసులపై సీరియస్ అయ్యారు. మంగళవారం బాధిత కుటుంబాల వారు మధిరలోని క్యాంపు కార్యాలయంలో భట్టిని కలిసి దాడి చేసిన విడియోలు, ఫోటోలు అయనకు చూపించారు. వెంటనే అక్కడే ఉన్న వైరా ఏసీపీని పిలిచి పట్ట పగలు కర్రలు, కత్తులతో దాడి చేయడం ఏమిటి లా అండ్ ఆర్డర్ విషయంలో కఠినంగా ఉండాలని మరోసారి ఇటువంటి సంఘటనలు జరగకుండా చూడాలని ఆదేశించారు. దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి రిమాండ్ చేసి జైలుకు తరలించామని పట్టణ సిఐ రమేష్ భట్టికి తెలిపారు.

నియోజకవర్గంలో భారీ వర్షం

మధిర, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మధిర నియోజకవర్గ వ్యాప్తంగా గడచిన రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. గత పదిహేను రోజులుగా వర్షాల కోసం ఎదురు చూసిన రైతులకు సోమ, మంగళవారం కురిసిన వర్షాలతో హర్షం వ్యక్తం చేస్తున్నారు, నియోజకవర్గం లోని అన్ని చెరువుల్లోకి వర్షం నీరు చేరడంతో చెరువుల కింద నాట్లు వేసేందుకు రైతులు సిద్ధం అవుతున్నారు. నియోజకవర్గంలోని అన్ని చెరువులు దాదాపు 90 శాతం నిండగా మరికొన్ని నిండి అలుగులు పారుతున్నాయి. మధిర మండలంలో 6.2 సెం.మీటర్లు వర్షం కురవగా బోనకల్ మండలంలో 6.3, ఎర్రుపాలెం మండలంలో 5.3, చింతకాని మండలంలో 6.5, ముదిగొండ మండలం లో 5.5 సెంటీమీటర్ల వర్షం కురిసింది.

మంత్రులను కలిసిన ఏఐసీసీ నాయకులు



మంత్రికి పుష్పగచ్ఛం అందిస్తున్న నాయకులు

కల్లూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవ సమస్యలను పరిష్కారించాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఎఐసీసీ రాష్ట్ర అధ్యక్షుడు పి.ఎనోష్‌కుమార్ ఆధ్వర్యంలో ఆ సంఘ నాయకులు మంగళవారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, సంక్షేమ, దివ్యాంగుల శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిలను హైదరాబాద్‌లో కలిసి వినతి ప్రతం అందించారు. క్రైస్తవలకు బరియల్ గ్రౌండ్, కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాలని, బీసీ సీ సర్టిఫికెట్ ఇవ్వాలని, నూతనంగా నిర్మించే చర్చిలకు అనుమతులు ఇవ్వాలని, చర్చిలు నిర్మించుకునేందుకు ఆర్థిక సహాయంలో భాగంగా నిధులు కేటాయించాలని ఎఐసీసీ నాయకుల బృందం తమ వినతి పత్రంలో మంత్రులను కోరారు. ఈ సందర్భంగా ఎఐసీసీ నాయకుల విజ్ఞాపనలకు స్పందించిన సదరు మంత్రులు సానుకూలంగా స్పందించారని ఎనోష్‌కుమార్ తెలిపారు. టియుపిసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోనె సాల్మన్‌రాజు, ఎఐసిసి జిల్లా ప్రధాన కార్యదర్శి బాలరాజు, మీడియాసెల్ జిల్లా అధ్యక్షుడు దాసరి డేవిడ్‌రాజు, మండల అధ్యక్షుడు ఎబినేజర్, నాయకులు ఎం.కేనడిరాజు, రవి, జాన్, సుందర్‌రాజు పాల్గొన్నారు.

న్యాయం చేయండంటూ దంపతుల నిరసన

» భూముల విషయంలో కుమారుడు దౌర్జన్యం చేస్తున్నాడని ఆవేదన



న్యాయం కోసం ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న దంపతులు

కల్లూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తమ స్వార్జిత భూముల విషయంలో కుమారుడు దౌర్జన్యం చేస్తున్నాడని ఆరోపిస్తూ తల్లిదండ్రులు మంగళవారం కల్లూరు ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసనకు దిగారు. మండలంలోని పుల్లయ్యబంజర గ్రామానికి చెందిన రంగు మోహన్‌రావు, హైమావతి దంపతులకు ముగ్గురు కుమారులు, ఓ కుమార్తె ఉంది. కుమారులు అందరికీ వివాహాలయ్యాయి. అయితే కుమార్తె మూగ, అవివాహితురాలు కావడంతో ఆమె తల్లిదండ్రుల వద్దే ఉంటోంది. ఈ క్రమంలో ఈ ఏడాది మార్చిలో మోహన్‌రావు దంపతులు తమకు చెందిన ఎకరం భూమిని రూ.20లక్షలకు అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి విక్రయించారు. అయితే ఆ భూమి తమకు సంబంధించినది కావడంతో అవసరాల నిమిత్తం భూమిని విక్రయించుకున్నామని, కానీ ఆ భూమికి ఎలాంటి సంబంధం లేకపోయినా తమ పెద్ద కుమారుడు లక్ష్మణరావు భూమి కొన్న వ్యక్తిని పొలంలోనికి వెళ్లకుండా అడ్డుకుంటున్నాడని మోహనరావు, హైమావతి దంపతులు ఆరోపిస్తున్నారు. అతనిపై చర్య తీసుకోవాలని కూతురు పద్మావతితో కలిసి ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసనకు దిగారు. విషయం తెలుసుకున్న లక్ష్మణరావు అక్కడి చేరుకుని తల్లిదండ్రులతో వాగ్వాదానికి దిగగా.. పోలీసులు వారందరినీ పోలీసు స్టేసన్‌కు తరలించారు. ఇక ఈ సంఘటనపై ఎలాంటి కేసు నమోదు కాలేదని ఎస్ఐ హరిత తెలిపారు.

బీఆర్ఎస్‌ను విమర్శించే అర్హత కాంగ్రెస్‌కు లేదు

మధిర రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మధిర నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో పెద్ద ఎత్తున అభివృద్ధి జరిగిందని, పదేపదే గతంలో అభివృద్ధి చేయలేదు, తామే చేశామంటూ కాంగ్రెస్ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, బీఆర్ఎస్‌ను విమర్శించే అర్హత కాంగ్రెస్‌కు లేదని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. మంగళవారం మధిరలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఏఎంసీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, పట్టణ కార్యదర్శి అరిగె శ్రీనివాసరావు మాట్లాడారు. మధిర పట్టణంలో అభివృద్ధికి బీఆర్ఎస్ ఎప్పుడూ ఆటంకం కాదని, అభివృద్ధి ముసుగులో జరుగుతున్న అవినీతిని, నాసిరకం పనులను మాత్రమే ప్రశ్నిస్తున్నామన్నారు. అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులు అస్తవ్యస్తంగా ఉన్నాయోలేవో కాంగ్రెస్ నాయకులే చెప్పాలన్నారు. కాంగ్రెస్ నాయకులు ఇప్పటికైనా అసత్య ప్రచారాలను మానుకోవాలని హితవు పలికారు. బీఆర్ఎస్ నాయకులు వంకాయలపాటి నాగేశ్వరరావు, పరిశా శ్రీనివాసరావు, వైవీ.అప్పారావు, నాగులవంచ రామారావు, బొగ్గుల భాస్కర్‌రెడ్డి, బత్తుల శ్రీను, మాధవి పాల్గొన్నారు.



మధిరలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

గిర్దావర్‌లు లేక ప్రజల ఇక్కట్లు

పెనుబల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పెనుబల్లి మండలంలో గిర్దావర్‌లుగా పనిచేసిన విజయభాస్కర్, జగదీష్‌లు ఒకేరోజు బదిలీ అయ్యారు. వారి స్థానంలో నియమితులైన గిర్దావర్‌లు మంగళవారం వరకు విధుల్లో చేరలేదు. దీంతో కార్యాలయంలో రేషన్‌కార్డుల పరిశీలన, ఇతర ధ్రువపత్రాలు, కార్యాలయ పనులు నిల్చిపోయాయి. కనీసం ఒక గిర్దావర్ విధుల్లో ఉన్నా కార్యకలాపాలు యధావిధిగా కొనసాగేవి. కానీ నేటివరకు ఇక్కడికి కేటాయించిన వారు విధుల్లో చేరలేదు. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పటం లేదు. ఈవిషయమై తహసీల్దార్ నారాయణమూర్తిని 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా ఇరువురు గిర్దావర్‌లు మంగళవారం సాయంత్రం వరకు విధుల్లో చేరలేదని తెలిపారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి గిర్దావర్‌లు విధుల్లో చేరేవిధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

18 అడుగులకు వైరా రిజర్వాయర్

వైరా, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వైరా రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరువైంది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 18.3అడుగులు కాగా మంగళవారం సాయంత్రానికి 18అడుగులకు చేరుకుంది. సోమవారం సాయంత్రం 16.9అడుగులతో నీటిమట్టం ఉంది. సోమవారం రాత్రి రిజర్వాయర్ పరివాహక ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలతో ఏర్లు, వాగుల నుంచి భారీగా వరదనీరు వచ్చి చేరింది. ఒక్కరోజులోనే దాదాపు 1.3అడుగుల నీటిమట్టం పెరిగింది. మంగళవారం పగలు కూడా వర్షాలు కురుస్తుండటంతో బుధవారం నాటికి పూర్తిస్థాయి నీటిమట్టాన్ని దాటే అవకాశముందని నీటిపారుదలశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. వైరాలో 41.20మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

29న బహిరంగ వేలం

ఏన్కూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం గార్లొడ్డు శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయం ప్రాంగణం నందు పాల పొంగలి, షెడ్ నందు గ్యాస్‌పొయ్యిలు సప్లయ్ చేయడానికి ఈనెల 29న మంగళవారం బహిరంగవేలం పాటు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ఎస్‌వీడీ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు ఆలయ ప్రాంగణంలో అధికారుల సమక్షంలో వేలంపాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలవారు డిపాజిట్ రూ.50వేలు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని కోరారు. వివరాలకు 8179536850 సెల్‌నెంబరులో సంప్రదించాలని కోరారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి

ముదిగొండ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని సీపీఎం గ్రామశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఆపార్టీ నాయకులు పంచాయతీ కార్యదర్శి రామకృష్ణకు ఒక వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గ్రామంలో నిజమైన అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించలేదని వినతి పత్రంలో పేర్కొన్నారు. వీధిలైట్లు వెలగకా వీధులన్నీ అంధకారంలో ఉన్నాయని తక్షణమే స్పందించి గ్రామంలోని సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని వారు కోరారు. మాజీ వైస్ ఎంపీపీ మంకెన దామోదర్, సీపీఎం నాయకులు మందరపు వెంకయ్య, మందరపు పద్మావతి, ఇరుకు నాగేశ్వరరావు, మెట్టెల సతీష్, పుచ్చకాయల రమేష్ పాల్గొన్నారు.

వ్యవసాయేతర వాటికి యూరియా వాడొద్దు



ఎరువుల స్టాక్‌ను పరిశీలిస్తున్న జేడీఏ పుల్లయ్య

కొణిజర్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉంది, వ్యవసాయేతర వాటికి యూరియాను వాడొద్దు, యూరియ కొరత వస్తుందని ఎక్కువగా యూరియాను తీసుకోవద్దు, సరిపడ మాత్రమే వాడుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య సూచించారు. మంగళవారం కొణిజర్ల మండలం తనికెళ్ళలోని పురుగుల మందు షాపును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డీలర్‌లంతా స్టాక్‌కు సంబందించి షాపులో స్టాక్ వివరాల బోర్డును ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చే యూరియా నెలవారి కోటాలో మాత్రమే పంపిస్తారని, రైతులు కూడ ఇప్పుడు ఉన్న అవసరాలకు మాత్రమే తీసుకెళ్లితే మిగిలిన రైతులందరికి యూరియా సరిపోతుందని తెలిపారు. యూరియాని వ్యవసాయేతర అవసరాలకు అంటే నలికిపాలకు, చేపల చేరువులలో, క్వారీ బాంబుల తయారీలో వాడే అవకాశం ఉన్నందున డీలర్‌లు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. రైతులకు ఇతర ఎరువులను లింక్ పెట్టినట్లు రైతులు ఫిర్యాదు చేస్తే ఎరువుల చట్టం ప్రకారం డీలర్‌ల మీద చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. మండల వ్యవసాయాధికారి బాలాజి, ఏఈవో శ్రీనివాస్‌రాజ్ పాల్గొన్నారు.

తల్లాడ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రైతుల అవసరాలకు సరిపడా యూరియా సరఫరా చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాదినేని రమేష్, బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక దొడ్డా కృష్ణయ్య భవనంలో కళ్యాణపు కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన రైతు సంఘం మండల మహాసభలో వారు మాట్లాడారు. వ్యవసాయానికి ప్రధాన రసాయనిక ఎరువైన యూరియా అందుబాటులో లేకపోవడంతో రైతులు ప్రతిరోజు ఎరువుల దుకాణాల వద్ద క్యూలైన్‌లో నిలబడి యూరియా తీసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. అనంతరం రైతు సంఘం తల్లాడ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈమేరకు అధ్యక్షుడుగా కళ్యాణపు కృష్ణయ్య, కార్యదర్శిగా నల్లమోతు మోహనరావు, సహాక కార్యదర్శిగా భూమా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా అయిలూరి కోఇరెడ్డి, కోశాధికారిగా అయిలూరి రామకృష్ణారెడ్డిలను ఎన్నుకున్నారు. రైతుసంఘం నాయకులు శీలం సత్యానారాయణరెడ్డి, అయినాల రామలింగేశ్వరరావు, రాజబోయిన సైదులు, పులి కృష్ణయ్య, షేక్ మస్తాన్, చల్లానాగేశ్వరరావు, కట్టా దర్గయ్య, పేరసాని వెంకటయ్య, పులి వెంకటనరసయ్య పాల్గొన్నారు.

కారేపల్లి జూలై 22 (ఆంధ్రజ్యోతి): సాగు రైతులకు అవసరమైన యూరియను ప్రభుత్వం సరఫరా చేయాలని జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు పుచ్చాకాయల శ్రీనువాస్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని కారేపల్లి క్రాస్‌రోడ్డులో ఆయన మాట్లాడుతూ.. పంటలు సాగుచేస్తున్న సమయంలో కొందరు దళారులు యూరియా కొరతను సష్టిస్తున్నారన్నారు. ప్రసుత్తం పంటలకు అవసరమైన యూరియా లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారని ఆయన ఈసందర్భంగా వాపోయారు. రైతులు కూడా వ్యవసాయ శాఖ అధికారుల ఆదేశానుసారం పంటలపై ఎరువులను వాడుకోవాలని, ఇష్టానుసారంగా కాంప్లెక్స్ ఎరువులను వాడుకొవద్దని శ్రీనివాస్‌రావు అన్నారు.

విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ

వైరా, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వైరాలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు ఏకరూప దుస్తులను వైష్ణవి మిల్క్ ప్రొడక్ట్స్ యజమాని బి.మురళీధర్ మంగళవారం అందజేశారు. ప్రిన్సిపల్ ఎల్.నవీనజ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ఈ దుస్తులను పంపిణీ చేశారు. సహాయం చేయటంలోనే జీవన సంతృప్తి ఉంటుందని మురళీధర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో అక్కిరాజు రామారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కారేపల్లి జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యహ్నం భోజనం వండెందకు అవసరమైన వంటపాత్రలను మంగళవారం మండల విద్యాశాఖఅధికారి దుగ్గిరాల. జయరాజ్ పంపిణీచేశారు. మొత్తం మండలంలో 74పాఠశాలలు ఉండగావాటిలో 49పాఠశాలలకు వంటపాత్రలు వచ్చాయని, వచ్చినవాటిని పాఠశాలల పంపిణీచేయడం జరిగిందని ఎంఈవో తెలిపారు. మిగిలిన పాఠశాలలకు త్వరలోనే వంటపాత్రలు వస్తాయన్నారు.

'ఇళ్ల విషయంలో రాజకీయాలకు తావు లేదు'

మధిర, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల విషయంలో రాజకీయాలకు తావు లేదని నిజమైన అర్హులుకు అన్యాయం జరగనివ్వమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం మధిరలోని డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో సీపీఎం నాయకులు ఆయనను కలిసి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు విషయంలో ఖమ్మంపాడు, దెందుకూరు, తూటికుంట్లతో పాటు అనేక గ్రామాల్లో అర్హత లేని వారికి ఇళ్లు కేటాయించారని తెలిపారు. అనర్హులు ఎవరైనా ఉంటే వారి పేర్లు అధికారులకు ఇవ్వాలని నిజంగా వారు అనర్హులు అని తేలితే వారిని తొలగించి వారి స్థానంలో అర్హులుకు ఇస్తామని ఈ విషయంలో రాజకీయం చేయాలని చూడొద్దని వారికి హితవు పలికారు. సీపీఎం డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, నాయకులు రామనర్సయ్య, మందా సైదులు, మురళి, నర్సింహరావు ఉన్నారు.

తల్లాడ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా నారాయణ



ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ సభ్యులు

తల్లాడ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడుగా గుడిపల్లి నారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం స్థానిక సొసైటీ కార్యాలయంలో ప్రెస్‌క్లబ్ మండల కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా దుగ్గిదేవర అజయ్‌కుమార్, మహ్మద్ ముస్తఫా, గౌరవ సలహదారులుగా అప్పిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మోదుగు జయరాజు, ఉపాధ్యక్షులుగా షేక్ మోహరాజ్, గురిజాల నారాయణరావు, సహాయ కార్యదర్శులుగా రుద్రాక్ష నరసింహాచారి, సురేష్, కోశాధికారిగా నాగబాబు, ఉప కోశాధికారిగా మేడి రాంబాబు, ప్రచార కార్యదర్శిగా గొడ్ల శ్రీనివాసరావుతో పాటు మరో 16మందిని క్యావర్గసభ్యులుగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులను ఘనంగా సన్మానించారు.